ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి
PRGI REGD NO.: TGTEL/26/A4986
అమరావతి | సంపుటి : 1 | సంచిక : 33 | సోమవారం 27-07-2026 | పేజీలు : 8 | వెల : రూ. 4/- www.prabhathakiranam.com
Medchal Malkajgiri | Volume : 1 | Issue : 33 | Monday 27-07-2026 | Pages : 8 | Price : Rs. 4/- Circulated to Telangana Published from Medchal Malkajgiri

## ఆప్ వర్సెస్ బీజేపీ



పంజాబ్‌లో పరీక్షల రాజకీయాలు
విద్యా మంత్రి రాజీనామా డిమాండ్!
బీజేపీకి పంజాబ్ సీఎం వార్నింగ్
బండారం మొత్తం బయటపెడ్తా
పేపర్ లీక్ ఆరోపణల కలకలం

- 3లో...

## ప్రపంచానికి రక్షణ భాగస్వామి

రక్షణ రంగంలో దూకుడు... భారత్ శక్తిపై ధీమా
మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



- 3లో...



## ప్రతిపక్షాల మాట వినండి

రేవంత్ విజ్ఞప్తి... యువశక్తే దేశ భవిష్యత్
మోదీకి స్పష్టం చేసిన ముఖ్యమంత్రి

ప్రధాని నరేంద్ర మోదీకి ఇది తొలి ఓటమి కాదని, రైతుల ఉద్యమం తర్వాత ఎదురైన మరో ఎదురుదెబ్బ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  పేర్కొన్నారు. మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు చెప్పే విషయాలు కూడా వినే అలవాటు ప్రధాని మోదీ చేసుకోవాలని సూచించారు దేశంలో ప్రధానికి వ్యతిరేకంగా కొత్త పోరాటం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. దేశం మారుతోందని, ఢిల్లీలో జరిగిన తాజా పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ సందేశం ఇచ్చాయని అన్నారు.

- 2లో...




## పరీక్షల ప్రక్షాళనకు
# మోదీ మాస్టర్ ప్లాన్

- 3లో...



పరీక్షల్లో పారదర్శకతకు కొత్త అడుగు
విద్యార్థుల భవిష్యత్‌పై కేంద్రం దృష్టి
పేపర్ లీకుల తర్వాత కీలక ప్రకటన

### నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్

## లీక్‌లకు శాశ్వత చెక్!

పరీక్షల ప్రక్షాళనకు ఆరుగురు మేధావులు..
నిపుణుల చేతిలో పరీక్షల భవిష్యత్
పరీక్షల వ్యవస్థకు కేంద్రం కొత్త బ్లూప్రింట్

- 6లో...

## రంగంలోకి డిజిటల్ సూపర్ బ్రెయిన్

ఆధార్‌తో దేశాన్ని మార్చిన మేధావి
పరీక్షల ప్రక్షాళనకు కదిలిన సంజీవి

## మీరాబాయ్ వెల్డన్

3 గేమ్స్.. 3 స్వర్ణాలు.. ఒకే రాణి!



గ్లాస్గో కామన్‌వెల్త్ వేదికపై భారత వెయిట్‌లిఫ్టింగ్ స్టార్ మీరాబాయి చాను మరోసారి బంగారు చరిత్ర రాసింది. మహిళల 48 కిలోల విభాగంలో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 190 కిలోల మొత్తం లిఫ్ట్‌తో కామన్‌వెల్త్ గేమ్స్ రికార్డును బద్దలు కొట్టింది. స్నాచ్‌లో 85 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 105 కిలోలు ఎత్తి రెండు విభాగాల్లోనూ కొత్త గేమ్స్ రికార్డులు నమోదు చేసింది. వరుసగా మూడో కామన్‌వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించి అరుదైన హ్యాట్రిక్ పూర్తి చేసింది. ఈ ఘనత సాధించిన మూడో భారత క్రీడాకారిణిగా చరిత్రలో తన పేరును శాశ్వతంగా లిఖించుకుంది. ఒక్కో లిఫ్ట్‌తో బార్‌పై బరువును మాత్రమే కాదు.. భారత అంచనాలను కూడా విజయ శిఖరాలకు చేర్చింది. గ్లాస్గో అరేనా మొత్తం “ఇండియా.. ఇండియా” నినాదాలతో మార్మోగిపోయేలా చేసిన మీరాబాయి, మరోసారి భారత క్రీడా ప్రపంచానికి గర్వకారణంగా నిలిచింది. నాలుగో రోజు పోటీల్లో భారత్‌కు వచ్చిన అతిపెద్ద విజయంగా ఈ స్వర్ణం నిలిచింది. అదే రోజున పురుషుల 60 కిలోల విభాగంలో చనాంబమ్ రిషికాంత్ సింగ్ రజత పతకం అందుకోవడంతో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత ఖాతాలో మరో కీలక విజయాన్ని జోడించింది. గ్లాస్గోలో భారత జెండా మరోసారి అత్యున్నత స్థానంలో ఎగరేసిన మీరాబాయి చాను ప్రదర్శన కామన్‌వెల్త్ క్రీడల చరిత్రలో చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచిపోయింది.

- 8లో...



## బీజేపీ చీఫ్‌కు అగ్ని పరీక్ష

### నబీకి జెన్‌జీ ఓటరు టెన్షన్

ఖాళీ చేసిన సీట్‌ను కాపాడుకునేదెలా?
సీటు నాదేనంటున్న ప్రశాంత్ కిశోర్
ప్రతిష్టాత్మకంగా బంకిపూర్ ఉపఎన్నిక

బీహార్ రాజధాని పాట్నాలోని బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక ఇప్పుడు సాధారణ ఎన్నిక కాదు. ఇది భారతీయ జనతా పార్టీకి ప్రతిష్టాత్మక పోరుగా మారింది. ఈ సీటు ఇక నాదే అంటూ ప్రశాంత్ కిశోర్ సవాల్ విసురుతుండగా, లక్షకు పైగా జెన్‌జీ ఓటర్లు ఈ పోరుకు అసలు జడ్జిలుగా మారారు. అందుకే బంకిపూర్ ఉపఎన్నిక... రాష్ట్రాల ఎన్నికల కంటే బీజేపీ చీఫ్ నితిన్ నబీన్‌కుపెద్ద అగ్నిపరీక్షగా మారింది.

- 6లో...



- 2లో...

## డాక్టర్ పెద్ద మనసు

మమత చూపిన వైద్యురాలు...
పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రాణదానం
30 నిమిషాల పోరాటం...
సీపీఆర్‌తో మళ్లీ కొట్టుకున్న గుండె

యశోదలో బీఆర్ఎస్ నేత చికిత్స

## 2,278 కోట్లతో భారీ ప్రాజెక్ట్




- 2లో...

ఆదిలాబాద్‌కు
ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్
భారీ ప్రాజెక్ట్‌కు
సర్కార్ ఆమోదం

## తస్మాత్ జాగ్రత్త.. బీకేర్‌ఫుల్

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లూటీ... ఫేక్ లింకులతో సైబర్ మోసాలు
లబ్ధిదారులకు సీపీ సజ్జనార్ సూచన

- 2లో...





## విద్యా మంత్రి రాజీనామా చేయాలి

సీఎం రేవంత్‌కు బీజేపీ చీఫ్ కౌంటర్
ఫీజు బకాయిలపై బీజేపీ అల్టిమేటమ్
వారం రోజులే గడువంటూ రణ గర్జన

- 2లో...


# డాక్టర్ పెద్ద మనసు

**మమత చూపిన వైద్యురాలు... పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రాణదానం**

**30 నిమిషాల పోరాటం... సీపీఆర్‌తో మళ్లీ కొట్టుకున్న గుండె**

**యశోదలో బీఆర్ఎస్ నేత చికిత్స**





బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రాణాలను వైద్యులు సమయస్ఫూర్తితో కాపాడారు. తీవ్ర శ్వాసకోశ ఇబ్బందితో హనుమకొండలోని రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకున్న ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండె ఆగిపోయింది. పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో వెంటనే వైద్య బృందం సీపీఆర్ ప్రారంభించింది. పల్స్, రక్తపోటు నమోదు కాని స్థితిలో కూడా వైద్యులు చికిత్సను ఆపకుండా కొనసాగించారు.

### 30 నిమిషాల పాటు సీపీఆర్

కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతా రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం దాదాపు 30 నిమిషాల పాటు నిరంతరంగా సీపీఆర్ నిర్వహించింది. మొత్తం తొమ్మిది నుంచి పది సైకిళ్ల సీపీఆర్ చేసిన తర్వాత ఆయన గుండె మళ్లీ స్పందించింది. రోగి తమ కళ్లముందే కుప్పకూలడంతో ఎలాంటి పరిస్థితిలోనూ చికిత్సను ఆపకూడదని నిర్ణయించుకున్నామని డాక్టర్ మమతా రెడ్డి తెలిపారు. చివరి వరకు ప్రయత్నం చేయాలన్న పట్టుదలే విజయాన్ని అందించిందని చెప్పారు.

### గుండెపోటు కాదని తేల్చిన పరీక్షలు

ప్రాణాపాయం నుంచి బయటపడిన వెంటనే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కార్డియాక్ క్యాథ్‌ల్యాబ్‌కు తరలించి పరీక్షలు నిర్వహించారు. కొరొనరీ యాంజియోగ్రామ్‌లో గుండె రక్తనాళాలు సాధారణంగానే ఉన్నాయని వైద్యులు గుర్తించారు. దీంతో ఇది గుండెపోటు కాదని నిర్ధారించారు. అనంతరం మరిన్ని పరీక్షల ద్వారా అక్యూట్ పల్మనరీ థ్రాంబోఎంబోలిజం ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఈ వ్యాధిలో ఊపిరితిత్తులకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనిలో రక్తం గడ్డకట్టి రక్తప్రసరణకు అడ్డంకి ఏర్పడుతుంది.

### సమయస్ఫూర్తితో నిలిచిన వైద్య బృందం

సుదర్శన్‌రెడ్డి ప్రాణాలను కాపాడిన ఘటనలో వైద్య బృందం అప్రమత్తత కీలక పాత్ర పోషించింది. అత్యవసర పరిస్థితిని వెంటనే గుర్తించడం, సీపీఆర్‌ను నిరంతరంగా కొనసాగించడం, అనంతరం ఖచ్చితమైన పరీక్షలతో అసలు సమస్యను గుర్తించడం వల్ల చికిత్స సరైన దిశలో సాగింది. ఈ ఘటన అత్యవసర వైద్యంలో సమయస్ఫూర్తి, సీపీఆర్ ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఒక్క నిమిషం కూడా ఎంత విలువైనదో ఈ సంఘటన స్పష్టం చేసింది. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరా తీశారు. అనారోగ్యానికి గురైన పెద్ది సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్‌లో వెంట ఉండి అత్యుత్తమ చికిత్స అందేలా చూడాలని కేటీఆర్‌ను ఆదేశించారు.

# ప్రతిపక్షాల మాట వినండి

**మోదీకి రేవంత్ విజ్ఞప్తి**

**యువశక్తే దేశ భవిష్యత్**

**స్పష్టం చేసిన ముఖ్యమంత్రి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా కొత్త పోరాటం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. దేశం మారుతోందని, ప్రతిపక్షాలు చెప్పే విషయాలు కూడా వినే అలవాటు ప్రధాని మోదీ చేసుకోవాలని సూచించారు. ఢిల్లీలో జరిగిన తాజా పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ సందేశం ఇచ్చాయని అన్నారు. ప్రధాని మోదీకి ఇది తొలి ఓటమి కాదని, రైతుల ఉద్యమం తర్వాత ఎదురైన మరో ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు.

### రైతుల ఉద్యమాన్ని గుర్తు చేసిన సీఎం

వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమయంలో దేశవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాలని అప్పట్లో డిమాండ్ చేశారని చెప్పారు. చివరకు రైతుల పోరాటానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం చట్టాలను రద్దు చేసి, రైతులకు ప్రధాని క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల శక్తిని కేంద్ర ప్రభుత్వం అప్పుడు గుర్తించిందని అన్నారు.

### నీట్ వివాదంపై కేంద్రంపై దాడి

సీబీఎస్ఈ, నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పరీక్షల్లో అవకతవకలపై కాంగ్రెస్ ప్రశ్నించినా స్పందించలేదని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖల ద్వారా ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించారని ఆరోపించారు. చివరకు దేశ యువత ఉద్యమంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.

### యువతే మోదీని ఓడించింది

దేశ యువత వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాడి తమ శక్తిని చాటిందని రేవంత్ రెడ్డి అన్నారు. రైతులు, యువత కలిసి ఉద్యమిస్తే ఏ ప్రభుత్వం అయినా వెనక్కి తగ్గాల్సిందేనని పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమ విజయమని అభివర్ణించారు. అయితే విద్యార్థుల డిమాండ్లలో ఇంకా కొన్ని కీలక అంశాలు పరిష్కారం కావాల్సి ఉందని చెప్పారు.

### 21 ఏళ్లకే పోటీ చేయాలి

దేశ రాజకీయాల్లో యువతకు మరింత ప్రాధాన్యం కల్పించాలని ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సు 25 సంవత్సరాలు ఉందని గుర్తు చేశారు. దానిని 21 సంవత్సరాలకు తగ్గించేలా చట్ట సవరణ చేయాలని కోరారు. రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల్లో పోటీ చేసే వయస్సును కూడా 25 సంవత్సరాలుగా నిర్ణయించాలని అభిప్రాయపడ్డారు.

### తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం

యువతకు రాజకీయ అవకాశాలు కల్పించే అంశంపై తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి ఉమ్మడి సమావేశాల్లో చర్చిస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గించే అంశంపై తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను దర్యాప్తు సంస్థలతో ఇబ్బంది పెట్టవచ్చేమో గానీ, దేశ యువత గొంతును అణచివేయడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై చట్ట సవరణ బిల్లు తీసుకురావాలని ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆ విజయం మీ ఖాతాలో వేసుకోవద్దు

### సీఎం రేవంత్‌పై కవిత ఘాటు విమర్శలు

అది దేశ యువత పోరాట ఫలమని వ్యాఖ్య

టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. 36 రోజులపాటు పోరాడి సాధించిన విద్యార్థుల విజయాన్ని సీఎం తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే పరిస్థితి రావడానికి విద్యార్థుల ఉద్యమమే కారణమని పేర్కొన్నారు. కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితిని యువతే తీసుకొచ్చిందని, దానిని కాంగ్రెస్ విజయంగా చూపించే ప్రయత్నం చేయడం సరికాదని విమర్శించారు.

### ఊరేగింపులతో మభ్యపెట్టలేరు



విద్యార్థుల విజయాన్ని తమ ఘనతగా చూపించేందుకు సీఎం సహా కాంగ్రెస్ నాయకులు నగర వీధుల్లో గంటల తరబడి ఊరేగింపులు చేశారని కవిత ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేసిన వైఫల్యాలపై యువత ప్రశ్నిస్తుందనే భయంతోనే ఈ ప్రదర్శనలు నిర్వహించారని ఆరోపించారు. కొవ్వొత్తులు పట్టుకొని ఊరేగింపులు చేసినంత మాత్రాన విద్యార్థులు నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.

### యువతకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

21 ఏళ్లకే పార్లమెంట్‌లో పోటీ చేసే అవకాశం కల్పించాలని ఇప్పుడు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కవిత ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తామని ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు.



# విద్యా మంత్రి రాజీనామా చేయాలి

**సీఎం రేవంత్‌కు బీజేపీ చీఫ్ కౌంటర్**

**ఫీజు బకాయిలపై బీజేపీ అల్టిమేటమ్**

**వారం రోజులే గడువంటూ రణ గర్జన**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్న నేపథ్యంలో వెంటనే ఆ బాధ్యత నుంచి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ వారం గడువు ఇస్తున్నామని ప్రకటించారు.

### కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో వ్యాఖ్యలు

సికింద్రాబాద్‌లోని తివోలి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి రామచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఉన్నత విద్య చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు.

### జెన్‌జీకి కార్గిల్ స్ఫూర్తి అవసరం

ఢిల్లీ నిరసనల గురించి కూడా రామచందర్ రావు ప్రస్తావించారు. ఆ నిరసనల వెనుక విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆయన వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్నారు. దానిని తెలంగాణ పరిస్థితులతో పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భారత సైనికుల ధైర్యసాహసాలను యువత తప్పక తెలుసుకోవాలని రామచందర్ రావు అన్నారు. ముఖ్యంగా జెన్‌జీ తరం దేశభక్తి, క్రమశిక్షణ, కర్తవ్యనిబద్ధత, మాతృభూమి సేవ వంటి విలువలను అలవరచుకోవాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చే "నేషన్ ఫస్ట్" స్ఫూర్తితో ప్రతి పౌరుడు సాగి తేనే దేశం స్థిరమైన అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు.



# హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లకు అవకాశం ఎప్పుడు?

**ఆరోగ్య శాఖ స్పందించాలి**

**ప్రభుత్వ నియామకాలపై అసోసియేషన్ డిమాండ్**

తెలంగాణ హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వం హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ల సేవలను సమర్థంగా వినియోగించాలని కోరింది. గత పదేళ్లుగా ఈ అంశంపై పోరాటం చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు సరైన నోటిఫికేషన్లు విడుదల కాలేదని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం రెండేళ్ల పూర్తి కాల కోర్సులు పూర్తి చేసిన 21 వేలకుపైగా నిపుణులు దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో మాత్రం వారికి తగిన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం వెనుకబడిందని విమర్శించారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ఎయిమ్స్, ఈఎస్ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరి సేవలను సమర్థంగా వినియోగిస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన టిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీఎం, ఏజీఎం స్థాయి గ్రూప్ పోస్టుల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ డిమాండ్‌ను అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్ నాయక్, రచన, భారతి, గోపాల్ రెడ్డి కూడా సమర్థించారు.

# 2,278 కోట్లతో భారీ ప్రాజెక్ట్

**ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్**

**భారీ ప్రాజెక్ట్‌కు సర్కార్ ఆమోదం**




ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం భారీగా 2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చింది. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నాయి. ఇందుకోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ప్రతిపాదించిన 700 ఎకరాల భూసేకరణకు బదులుగా కొత్త ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

### రక్షణతో పాటు పౌర విమానయానం

ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ అవసరాలు, పౌర విమానయాన సేవలు రెండింటికీ ఒకే వేదిక సిద్ధం కానుంది. ప్రాజెక్టులో సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, కార్గో టెర్మినల్, మెయింటెనెన్స్ రిపేర్ ఓవర్‌హాల్ కేంద్రం, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించిన సంయుక్త సర్వే ఆధారంగా 9 వేల అడుగుల రన్‌వే నిర్మించాలని నిర్ణయించారు.

### అనుబంధ పనులకు భారీ వ్యయం

ఈ ప్రాజెక్టులో భూసేకరణకే ?1,555.11 కోట్లు వెచ్చించనున్నారు. 765 కేవీ విద్యుత్ టవర్ల తరలింపుకు ?310 కోట్లు, వాగుల మళ్లింపుకు ?57.49 కోట్లు, ఆదిలాబాద్--అనుకుంట రహదారి మార్పుకు ?35 కోట్లు, విద్యుత్ మౌలిక సదుపాయాల మార్పుకు ?18.76 కోట్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల తరలింపుకు ?3.55 కోట్లు, నిర్మాణాల పరిహారానికి ?31 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన అన్ని అడ్డంకులను ప్రభుత్వం తొలగించనుంది.

### డిసెంబర్‌లోపు భూసేకరణ పూర్తి

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, ఇతర అనుబంధ పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూసేకరణతో పాటు రహదారి మార్పులు, విద్యుత్ లైన్ల తరలింపు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల మార్పు వంటి పనులు కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించింది.

### 2,009 ఎకరాల భూసేకరణ

మొత్తం భూసేకరణలో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళానికి, 400 ఎకరాలు పౌర విమానయాన మౌలిక సదుపాయాలకు కేటాయించనున్నారు. ప్రస్తుతం వైమానిక దళానికి అక్కడ 369.45 ఎకరాల భూమి ఉన్నప్పటికీ, శిక్షణ కేంద్రం కోసం మరో 1,500 ఎకరాల నిరంతర భూభాగం అవసరమని కోరింది. ఆ భూమిని ప్రభుత్వం ఉచితంగా సేకరించి అప్పగించేందుకు అంగీకరించింది.

### తెలంగాణ అభివృద్ధికి కీలక మైలురాయి

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ ప్రాజెక్టును తెలంగాణకు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైందిగా అభివర్ణించారు. పారిశ్రామిక అభివృద్ధి, కార్గో రవాణా, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాలకు ఇది కొత్త ఊపునిస్తుందని తెలిపారు. జాతీయ భద్రతను బలోపేతం చేయడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టుగా ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ నిలవనుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.



# డీకే ఫిలాసఫీ

**దేశాన్ని చీల్చే కుట్రలు సాగవ్**

**రాహుల్, కేటీఆర్, రేవంత్‌పై ఫైర్**

దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ. భారతదేశాన్ని మరో నేపాల్, బంగ్లాదేశ్‌లా మార్చాలని కొందరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారందరూ త్వరలోనే ప్రజల ముందు బట్టబయలు అవుతారని అన్నారు. దేశాన్ని చీల్చే ప్రయత్నాలను భారత ప్రజలు ఎప్పటికీ సహించరని స్పష్టం చేశారు.

### రాహుల్ గాంధీపై ప్రశ్నలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా డీకే అరుణ విమర్శలు గుప్పించారు. నీట్ పరీక్ష రద్దు అయినప్పుడు ఎందుకు నిరసన చేపట్టలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై నిరసనలు నిర్వహిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

### కేటీఆర్, రేవంత్‌పై విమర్శలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా డీకే అరుణ విమర్శలు చేశారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై మాట్లాడే నైతిక హక్కు ఇద్దరికీ లేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్–1 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయినప్పుడు ఎవరూ రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటనపై బాధ్యత ఎవరు తీసుకున్నారని ప్రశ్నించారు.

### ప్రజలు తగిన బుద్ధి చెబుతారు

పరీక్షల వంటి సున్నితమైన అంశాలను రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న వారిపై డీకే అరుణ మండిపడ్డారు. ప్రజలను తప్పుదారి పట్టించే నాయకులకు తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని హెచ్చరించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే వారిని ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని డీకే అరుణ పేర్కొన్నారు.

# తస్మాత్ జాగ్రత్త.. బీకేర్‌ఫుల్

**ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లూటీ**

**ఫేక్ లింకులతో సైబర్ మోసాలు**

**లబ్ధిదారులకు సీపీ సజ్జనార్ సూచన**



ఇందిరమ్మ టవర్స్ గృహ పథకం పేరుతో సైబర్ మోసాలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. పథకం లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఫోన్ కాల్స్, ఫేక్ వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింకులు పంపిస్తూ డబ్బు, వ్యక్తిగత వివరాలు దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈఎండీగా ?10 వేల చెల్లింపులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### బ్రోకర్లను నమ్మొద్దు

ఇందిరమ్మ గృహాల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి బ్రోకర్లు, మధ్యవర్తులు ఉండరని తెలిపారు. డబ్బు ఇస్తే ఇల్లు ఇప్పిస్తామని చెప్పే వారిని నమ్మవద్దని హెచ్చరించారు. దరఖాస్తు రద్దవుతుందని బెదిరిస్తూ వెంటనే డబ్బు చెల్లించాలని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మొద్దని సూచించారు.

### ఈఎండీ మొత్తం తిరిగి వస్తుంది

దరఖాస్తుదారుకు ఇల్లు కేటాయించకపోతే చెల్లించిన ?10 వేల ఈఎండీ మొత్తం అదే బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వం తిరిగి జమ చేస్తుందని సజ్జనార్ వివరించారు. రీఫండ్ పేరుతో ఎవరైనా డబ్బు అడిగినా స్పందించవద్దని చెప్పారు. యూపీఐ పిన్ డబ్బు పంపడానికి మాత్రమే అవసరమని, డబ్బు స్వీకరించడానికి ఎప్పుడూ నమోదు చేయాల్సిన అవసరం లేదని గుర్తు చేశారు.

### ఫేక్ లింకులు ప్రమాదకరం

వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని సజ్జనార్ హెచ్చరించారు. ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. నకిలీ ప్రభుత్వ వెబ్‌సైట్లు సృష్టించి మోసాలు చేసే అవకాశం ఉందన్నారు. అనీడెస్క్, టీమ్‌వ్యూయర్ వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయాలని ఎవరైనా కోరితే వెంటనే నిరాకరించాలని సూచించారు. అలాంటి యాప్‌ల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు దొంగిలించే ప్రమాదం ఉంటుందని చెప్పారు.




### మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు

ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి గోప్యమైన వివరాలను ఎవరికీ చెప్పవద్దని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ గృహ పథకానికి సంబంధించిన సందేహాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 040–24603572ను సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు. వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

# పరీక్షల ప్రక్షాళనకు మోదీ మాస్టర్ ప్లాన్

## నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్

**పరీక్షల్లో పారదర్శకతకు కొత్త అడుగు**

**విద్యార్థుల భవిష్యత్‌పై కేంద్రం దృష్టి**



దేశంలో పరీక్షల నిర్వహణను మరింత విశ్వసనీయంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ప్రముఖ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ సమగ్ర నివేదిక ఆధారంగా భవిష్యత్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు అమలు చేస్తామని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ స్పష్టం చేశారు.

### పేపర్ లీకుల తర్వాత కీలక ప్రకటన

దేశవ్యాప్తంగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల జరిగిన నిరసనల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆ పరిణామాల అనంతరం పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంచే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పరీక్షల అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, పలువురు జైలులో ఉన్నారని మోదీ గుర్తు చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని, కఠిన నిబంధనలతో కొత్త చట్టం తీసుకురావడానికి పార్లమెంట్‌లో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### సాంకేతికతకు పెద్దపీట

భారత పరీక్షల వ్యవస్థ పారదర్శకంగా, నమ్మకంగా ఉండాలంటే అత్యాధునిక సాంకేతికత వినియోగం తప్పనిసరి అని ప్రధాని అభిప్రాయపడ్డారు. అదే లక్ష్యంతో ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణుడు నందన్ నీలేకనికి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. టాస్క్‌ఫోర్స్ నివేదిక వచ్చిన వెంటనే అమలు చర్యలు ప్రారంభిస్తామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికతతో పాటు నిర్మాణాత్మక మార్పులపైనా కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది.

కీలక నిపుణులతో కమిటీ ఏర్పాటు

నందన్ నీలేకనితో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులను ఈ టాస్క్‌ఫోర్స్‌లో సభ్యులుగా నియమించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా వ్యవహరించనున్నారు. పరీక్షల భద్రత, సాంకేతిక మౌలిక వసతులు, పరిపాలనా సంస్కరణలపై వీరు సమగ్ర సిఫార్సులు చేయనున్నారు.

### నీలేకని అనుభవం కేంద్రానికి బలం

ఆధార్ వ్యవస్థను అమలు చేసిన యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా తొలి ఛైర్మన్‌గా నందన్ నీలేకని విశేష సేవలు అందించారు. ఈ-గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫార్మ్‌ల అభివృద్ధిలో ఆయనకు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఈజీఓవ్ ఫౌండేషన్, ఏక్‌స్టెప్ ఫౌండేషన్ ద్వారా పట్టణ పాలన, పిల్లల ప్రాథమిక విద్యాభివృద్ధికి సాంకేతిక పరిష్కారాలను అందించారు. ఐఐటీ బొంబాయి పట్టభద్రుడైన ఆయనకు పద్మభూషణ్ సహా పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

### పరీక్షలపై విశ్వాసం పెంచడమే లక్ష్యం

దేశంలోని పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, నియామక పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తిరిగి నమ్మకం కల్పించడమే ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది. సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ, కఠిన భద్రతా ప్రమాణాలు, పారదర్శక విధానాలు అమలైతే పేపర్ లీకులు, అవకతవకలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. టాస్క్‌ఫోర్స్ నివేదిక ఆధారంగా అమలు కానున్న సంస్కరణలు భారత పరీక్షల వ్యవస్థలో కీలక మలుపు కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## రంగంలోకి డిజిటల్ సూపర్ బ్రెయిన్

**ఆధార్‌తో దేశాన్ని మార్చిన మేధావి... పరీక్షల ప్రక్షాళనకు కదిలిన సంజీవి**



దేశంలో డిజిటల్ విప్లవానికి పునాది వేసిన పేరు ఏదైనా ఉంటే అది నందన్ నీలేకనిదే. ఒకప్పుడు ప్రతి భారతీయుడికి ప్రత్యేక గుర్తింపును అందించిన ఆధార్ వ్యవస్థ వెనుక ఉన్న కీలక మేధావి ఆయనే. కోట్లాది మంది జీవితాలను సులభతరం చేసిన డిజిటల్ పరిష్కారాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నీలేకనిపై ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి కీలక బాధ్యత ఉంచారు. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలపై పెరిగిన అనుమానాల నేపథ్యంలో భారత పరీక్షల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. సాంకేతికతతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల నాయకుడిగా నీలేకని ఇప్పటికే తన సామర్థ్యాన్ని నిరూపించారు. ఆధార్‌తో గుర్తింపు వ్యవస్థను బలోపేతం చేసిన ఆయన, ఇప్పుడు పరీక్షల విశ్వసనీయతను పెంచే దిశగా అడుగులు వేయనున్నారు. విద్యార్థుల భవిష్యత్తును భద్రపరిచే సంస్కరణలకు ఆయన నివేదిక కీలక మార్గదర్శకంగా మారనుంది. అందుకే దేశ డిజిటల్ ప్రయాణాన్ని విజయవంతం చేసిన నీలేకనిపైనే ఇప్పుడు మోదీ చూపు నిలిచింది. ఆయన అనుభవం, సాంకేతిక దూరదృష్టి భారత పరీక్షల వ్యవస్థకు కొత్త ప్రమాణాలు తీసుకురావాలనే ఆశలు దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.



## పంజాబ్‌లో పరీక్షల రాజకీయాలు విద్యా మంత్రి రాజీనామా డిమాండ్!

# ఆప్ వర్సెస్ బీజేపీ

**బీజేపీకి పంజాబ్ సీఎం వార్నింగ్**

**బండారం మొత్తం బయటపెడ్తా**

**పేపర్ లీక్ ఆరోపణల కలకలం**

కేంద్ర మాజీ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం పేపర్ లీక్ వ్యవహారం ఇప్పుడు పంజాబ్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది. భారతీయ జనతా పార్టీ పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడిన వారిపై ఒకే ప్రమాణం ఉండాలని బీజేపీ పేర్కొంది. కేంద్రంలో రాజీనామా జరిగితే పంజాబ్‌లో కూడా అదే నైతిక బాధ్యత వర్తించాలని ప్రశ్నిస్తోంది. కాక్రోచ్ నేతలతో కీలక చర్చలు జరిపిన జేపీ నడ్డా ఇప్పుడు పంజాబ్‌పై ఫోకస్ పెట్టే అవకాశముందని కూడా వార్తలు వస్తున్నాయ్.

### బీజేపీ తీవ్ర ఆరోపణలు

బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ పంజాబ్‌లో గత కొన్నేళ్లుగా అనేక పరీక్షల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పంజాబ్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు 12వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష, పంజాబ్ స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్, అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయని పేర్కొన్నారు. పంజాబ్ సబ్‌ఆర్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డు నియామకాలు, గ్రూప్-బీ పరీక్షల్లో కూడా అక్రమాలు జరిగాయని విమర్శించారు. నాయబ్ తహసీల్దార్, ఫార్మసీ ఆఫీసర్ నియామక పరీక్షల్లో బ్లూటూత్ పరికరాలతో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

### కాంగ్రెస్ కూడా అదే స్వరం

పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత నాలుగేళ్లలో ఆరు ప్రధాన పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ఆరోపించారు. విద్యార్థుల కలలు ఛిన్నాభిన్నం అయ్యాయని, ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యత స్వీకరించలేదని అన్నారు. విద్యార్థులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

### భగవంత్ మాన్ ఘాటు సమాధానం

ఈ ఆరోపణలను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పూర్తిగా ఖండించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత నాలుగున్నరేళ్లలో ఒక్క ప్రశ్నాపత్రం కూడా లీక్ కాలేదని స్పష్టం చేశారు. ఐతే రెండు పరీక్షా కేంద్రాల్లో ఫేక్ ప్రచారం నిజమేనని అంగీకరించారు. అయితే వాటిని పది నిమిషాల్లోనే గుర్తించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. దుష్ప్రచారం చేసే ముఠాలపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టామని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పంజాబ్‌లో పేపర్ లీక్ జరగదని హామీ ఇచ్చారు.

### ఆప్ ప్రతివాదం

ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు బల్తేజ్ పన్ను కూడా బీజేపీ ఆరోపణలను తిప్పికొట్టారు. కొన్ని పరీక్షల్లో అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్షలు రాసేందుకు ప్రయత్నించిన విషయం నిజమేనని చెప్పారు. అయితే దానిని ప్రశ్నాపత్రాల లీక్‌గా చిత్రీకరించడం పూర్తిగా తప్పుడు ప్రచారమని విమర్శించారు. గతంలో కేంద్రంలోని బీజేపీ పాలనలో 90కు పైగా పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ఆరోపిస్తూ, ఇప్పుడు వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ విమర్శలు చేస్తున్నారని అన్నారు.

### రాజకీయంగా మారిన పరీక్షల వివాదం

నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెద్ద రాజకీయ అంశంగా మారిన వేళ, ఇప్పుడు పంజాబ్‌లో కూడా అదే అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఒకవైపు బీజేపీ, కాంగ్రెస్ విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతుండగా, మరోవైపు ఆప్ ప్రభుత్వం పేపర్ లీక్ జరగలేదని స్పష్టంగా చెబుతోంది. ఈ ఆరోపణలు, ప్రతిఆరోపణల మధ్య విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయతపై చర్చ మరింత వేడెక్కుతోంది.



# కనకదుర్గమ్మకు బంగారు బోనం

**భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట**

**16 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తెలంగాణలోని హైదరాబాద్ నుంచి సంప్రదాయబద్ధంగా తీసుకొచ్చే బంగారు బోనాన్ని అమ్మవారికి సమర్పించనున్నారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. గత 16 ఏళ్లుగా తెలంగాణ భక్తులు ప్రతి ఏడాది బంగారు బోనం సమర్పిస్తూ అమ్మవారిపై తమ విశ్వాసాన్ని చాటుకుంటున్నారు.

### ప్రత్యేక పూజలతో బోనాల ఊరేగింపు

ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య విజయవాడ బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం బోనాల బృందం భారీ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రి వైపు బయలుదేరనుంది. మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల మధ్య చిన రాజగోపురం వద్దకు చేరుకున్న తర్వాత అమ్మవారికి బంగారు బోనం సమర్పించే కార్యక్రమం ప్రారంభం కానుంది. రెండు గంటలకు పైగా ఈ ఆధ్యాత్మిక ఊరేగింపు కొనసాగనున్నట్లు అధికారులు వెల్లడించారు.

### వీఐపీ దర్శనాలకు తాత్కాలిక విరామం

ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా తెలంగాణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ప్రకటించారు. సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

### అమ్మవారికి బోనం సమర్పించిన తలసాని

హైదరాబాద్ పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మకు బోనం సమర్పించడం 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కుటుంబ సమేతంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారిని దర్శించుకున్న ఆయన, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఆషాఢ మాసం తెలంగాణ ప్రజలకు అత్యంత పవిత్రమైన పండుగల కాలమని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీ అని వివరించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అమ్మవారి కరుణతో విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

# బీజేపీ చీఫ్‌కు అగ్ని పరీక్ష

## నబీకి జెన్‌జీ ఓటరు టెన్షన్

**ఖాళీ చేసిన సీట్‌ను కాపాడుకునేదెలా?**

**సీటు నాదేనంటున్న ప్రశాంత్ కిశోర్**

**ప్రతిష్ఠాత్మకంగా బంకిపూర్ ఉపఎన్నిక**



ఒక రాష్ట్రాన్ని గెలవడం కంటే... ఒక సీటును నిలబెట్టుకోవడమే కొన్నిసార్లు పెద్ద యుద్ధం అవుతుంది. ఇప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు ఎదురైన పరిస్థితి అదే. పార్టీ దేశవ్యాప్తంగా ఎన్నికల వ్యూహాలు రచిస్తున్నా... రాజకీయంగా అందరి చూపు మాత్రం ఆయన ఖాళీ చేసిన బంకిపూర్ అసెంబ్లీ స్థానంపైనే ఉంది. ఒకప్పుడు తన విజయాలకు చిరునామాగా నిలిచిన ఈ సీటును బీజేపీ మళ్లీ కైవసం చేసుకోలేకపోతే... అది కేవలం ఉపఎన్నిక ఓటమిగా కాదు, పార్టీ అధ్యక్షుడి ప్రతిష్ఠపై పడిన ముద్రగా మారుతుంది. మరోవైపు "ఈ సీటు ఇక నాదే" అంటూ ప్రశాంత్ కిశోర్ సవాల్ విసురుతుండగా, లక్షకు పైగా జెన్‌జీ ఓటర్లు ఈ పోరుకు అసలు జడ్జిలుగా మారారు. అందుకే బంకిపూర్ ఉపఎన్నిక... రాష్ట్రాల ఎన్నికల కంటే బీజేపీ చీఫ్‌కు పెద్ద అగ్నిపరీక్షగా మారింది.

బీహార్ రాజధాని పాట్నాలోని బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక ఇప్పుడు సాధారణ ఎన్నిక కాదు. ఇది భారతీయ జనతా పార్టీకి ప్రతిష్ఠాత్మక పోరుగా మారింది. అదే సమయంలో సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ రాజకీయ బలాన్ని పరీక్షించే ఎన్నికగా మారింది. దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాల ప్రభావం కొనసాగుతున్న వేళ ఈ ఉపఎన్నికలో జెన్‌జీ ఓటర్లు కీలక పాత్ర పోషించనున్నారనే అంచనాలు వినిపిస్తున్నాయి.

### బీజేపీకి బలమైన కోట

బంకిపూర్ నియోజకవర్గం చాలా కాలంగా బీజేపీకి కంచుకోటగా ఉంది. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఆయన ఈ నియోజకవర్గం నుంచి పలుమార్లు విజయం సాధించారు. కేంద్రంలో, బీహార్‌లో అధికారంలో ఉన్న బీజేపీకి ఈ సీటును నిలబెట్టుకోవడం ప్రతిష్ఠాత్మకంగా మారింది. మరోవైపు ప్రశాంత్ కిశోర్ స్వయంగా బరిలోకి దిగడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

### విద్యార్థి ఉద్యమాల ప్రభావం

ఇటీవల జరిగిన పోటీ పరీక్షల వివాదాలు, విద్యార్థి నిరసనలు యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచాయి. ఉద్యోగాలు, విద్య, పరీక్షల పారదర్శకతపై వేలాది మంది విద్యార్థులు రోడ్డెక్కారు. నిరసనల సమయంలో జరిగిన పోలీసు చర్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారి తీశాయి. దీంతో ఈ ఎన్నికలో కూడా విద్య, ఉపాధి ప్రధాన చర్చాంశాలుగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశాలను ప్రశాంత్ కిశోర్ బలంగా ప్రచారం చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

### అభివృద్ధి బీజేపీ అస్త్రం

ఈ ఎన్నికలో బీజేపీ తన అభివృద్ధి పనులు, బలమైన పార్టీ నిర్మాణం, సంప్రదాయ ఓటు బ్యాంక్‌ను ప్రధాన ఆయుధంగా వినియోగిస్తోంది. బూత్ స్థాయి వరకు విస్తరించిన పార్టీ యంత్రాంగం బీజేపీకి పెద్ద బలం. వ్యాపార వర్గాలు, మధ్యతరగతి, సుదీర్ఘకాలంగా బీజేపీకి మద్దతు ఇస్తున్న ఓటర్లను మరోసారి తనవైపు తిప్పుకునేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. స్థిరమైన నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రధానంగా ప్రచారం చేస్తోంది.

### ఎన్నిక ఫలితాన్ని ఎవరు నిర్ణయిస్తారు?

జెన్‌జీ ఓటర్లు సంప్రదాయ ఓటర్లలా ఒకే పార్టీకి కట్టుబడి ఉండరని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, సమకాలీన అంశాల ఆధారంగా వారి నిర్ణయాలు మారే అవకాశం ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ ఉద్యమం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసినా, ఆ ప్రభావం పోలింగ్ రోజు వరకు కొనసాగుతుందా లేదా అన్నది కీలకంగా మారింది. చివరికి యువ ఓటర్ల పోలింగ్ శాతం, సంప్రదాయ ఓటు బ్యాంకుల ప్రభావం కలిసి బంకిపూర్ ఉపఎన్నిక ఫలితాన్ని నిర్ణయించే అంశాలుగా నిలవనున్నాయి.

### జెన్‌జీ ఓటర్లే గేమ్‌చేంజర్లు

బంకిపూర్ ప్రత్యేకత యువ ఓటర్ల సంఖ్య. మొత్తం 3.79 లక్షల ఓటర్లలో సుమారు 1.20 లక్షల నుంచి 1.35 లక్షల మంది వరకు 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారే. పాట్నా యూనివర్సిటీ, ఎన్ఐటీ పాట్నా, బీఎన్ కాలేజ్, సైన్స్ కాలేజ్, ఏఎన్ కాలేజ్, చాణక్య నేషనల్ లా యూనివర్సిటీతో పాటు అనేక కోచింగ్ సెంటర్లు ఈ ప్రాంతంలో ఉండటంతో విద్యార్థుల ప్రభావం అధికంగా ఉంది. ఉపాధి, విద్య, పోటీ పరీక్షల అంశాలపై ఈ వర్గం ఎక్కువగా స్పందిస్తోంది.



# ప్రపంచానికి రక్షణ భాగస్వామి

**రక్షణ రంగంలో దూకుడు... భారత్ శక్తిపై మోదీ ధీమా**

**మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ**

భారత్ రక్షణ ఉత్పత్తి, రక్షణ ఎగుమతులు, మిత్రదేశాలతో వ్యూహాత్మక సహకారంలో వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు నివాళులర్పించారు. సైనికుల ధైర్యానికి తోడు దేశం సాంకేతిక సామర్థ్యాన్ని కూడా బలోపేతం చేస్తోందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం ఇప్పుడు రక్షణ రంగంలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

### స్వదేశీ ఆయుధాలతో ప్రపంచ గుర్తింపు

భారత నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి పూర్తిగా దేశీయ సాంకేతికతతో నిర్మించిన యుద్ధ నౌక అని మోదీ తెలిపారు. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పదార్థాలు వినియోగించారని చెప్పారు. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ విజయవంతంగా పరీక్షించిందని గుర్తు చేశారు. కుషా క్షిపణి పరీక్ష కూడా విజయవంతమైందని వెల్లడించారు. శాస్త్రవేత్తల కృషి దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచిందని కొనియాడారు.

### పెరుగుతున్న ప్రపంచ విశ్వాసం


ఇటీవల ఇండోనేషియా పర్యటనలో బ్రహ్మోస్, అస్త్ర క్షిపణులకు సంబంధించిన కీలక ఒప్పందాలు కుదిరాయని ప్రధాని వెల్లడించారు. భారత రక్షణ పరికరాలు, సాంకేతికతపై ప్రపంచ దేశాల నమ్మకం పెరుగుతోందని చెప్పారు. రక్షణ రంగంలో భారత్ ఇప్పుడు విశ్వసనీయ భాగస్వామిగా ఎదుగుతోందని స్పష్టం చేశారు.

### యువత విజయాలకు ప్రశంసలు

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించిన మోదీ, ఇటీవల పీవీ సింధు జపాన్ ఓపెన్ టైటిల్ గెలవడం గర్వకారణమన్నారు. లార్డ్స్ మైదానంలో భారత మహిళల క్రికెట్ జట్టు తొలి టెస్టు విజయం దేశ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో భారత విద్యార్థులు స్వర్ణ పతకాలతో అద్భుత ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. దేశ యువత ప్రతిభ ప్రపంచ వేదికపై భారత్‌కు మరింత గౌరవం తీసుకొస్తోందని ప్రధాని మోదీ అభినందించారు.

ప్రభాత
కిరణమ్
4
సోమవారం 27 జూలై 2026
www.naadesam.com

# దక్షిణ భారతంలో ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం సింహాచలం



**క్షేత్ర గాధ :**

రాక్షస రాజు అయిన హిరణ్యకశిపుడు బ్రహ్మ వరం వల్ల గర్వంతో నన్ను తప్ప ఎవరిని పూజించవద్దు అన్నాడు కానీ ఆయన కుమారుడు పుట్టుకతోనే విష్ణు భక్తుడు తన తండ్రి ఎన్ని హింసలు పెట్టినా ప్రహ్లాదుడు "ఓం నమో నారాయణాయ" అంటూ పరితపించేవాడు. కోపంతో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడని చంపడానికి చూశాడు అప్పుడు విష్ణువు నరసింహ అవతారంలో వచ్చి హిరణ్యకశివుని సంహరించాడు.

**వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆవిర్భావం :**

ప్రహ్లాదుడు శాంతి కోసం తపస్సు చేశాడు స్వామి నువ్వు నాకు ప్రత్యక్షం కావాలి అని కోరాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు వరాహరూపంలో ఈ సింహాచల కొండపై వెలిశారు. స్వామివారి ముఖం వరాహ రూపం శరీరాకృతి సింహ రూపం మరియు మనిషి ఆకృతి.

ప్రహ్లాదుడు కోరిక మేరకు శ్రీమహావిష్ణువు వరాహ రూపంలో నరసింహ రూపంలో కలిసి వరాహ నరసింహగా సింహాచలం కొండపైన ఆవిర్భవించారు.

**స్వామివారి ప్రత్యేకత:**

1. చందన కప్పు :-మూడు అడుగుల మందంతో చందన పూతగా స్వామివారి ఒంటినిండా చందనాన్ని కప్పి ఉంచుతారు.
2. అసలు రూపం :- సింహం ముఖం మనిషి శరీరం వరాహ నాసికం కలిసిన దివ్యమైన సుందరమైన ప్రశాంత రూపం.
3. నిజరూప దర్శనం:- సంవత్సరంలో వైశాఖ శుద్ధ తదియ నుండి వైశాఖ బహుళ తదియ వరకు 12 రోజులు మాత్రమే చందనం తీసి అసలు రూపంతో స్వామి వారు దర్శనమిస్తారు దానినే చందన ఉత్సవం అంటారు భక్తులు ఆ రోజు నా సింహాద్రి అప్పన్న ఎంతో ప్రేమగా ప్రసన్నంగా కొలుచుకొని సింహాద్రి అప్పన్న స్వామి అని పిలుచుకుంటారు.

**గిరి ప్రదక్షణ :-**

ప్రహ్లాద భక్తికి మెచ్చి స్వామి కొండపైన వెలిశారు. కొంతమంది భక్తులు అప్పట్లో కొండ ఎక్కలేక తొలి పావంచా నుండి కొంత దూరం అంటే 32 కిలోమీటర్లు దరిదాపుగా అంతా కాలినడకన మంచి ఆలోచనతో మనసు ప్రశాంతతతో ప్రదక్షిణలు చేసేవారు ఇలా చేసిన భక్తులకు కోరిన కోర్కెలు తీరడం సంతానం కలగడం ఆరోగ్యం మెరుగు పడటం జరిగింది. త్రేతా యుగంలో రాముడు లక్ష్మణుడు కూడా ఈ కొండ చుట్టూ తిరిగేరని స్థలపురాణం చెబుతున్నది. 32 కిలోమీటర్లు దూరాన వరకు ప్రభుత్వం అనేక రకాలైన ఆరోగ్య వైద్య మంచినీరు ఉచిత ఆహారం మొదలగు సేవలన్నీ కూడా ఇవ్వడం జరుగుతున్నది.

- శ్రీమతి. ఏ. బాల సౌజన్య కుమారి
(ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, తెలుగు ఆచార్యులు)

# రాజకీయాల్లోనే కొనసాగుతా!



ఎన్నికలకు మాత్రం గుడ్‌బై..
మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య వీడ్కోలు


- 6లో...




# విద్యకు భరోసా

ఒక పోస్ట్‌కు స్పందన..
లోకేశ్ స్ఫూర్తిదాయక నిర్ణయం!

- 5లో...




- 6లో...

# కర్నూలులో కలకలం..!

గాల్లోకి కాల్పులు.. పరారైన దుండగులు



- 6లో...

# కోలుకుంటున్న షర్మిల

## దుర్గమ్మకు బంగారు బోనం

భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట
16 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం

- 3లో...




2029లో అధికారాన్ని నిర్ణయించేది కేవలం కూటములు కాదు... వారసత్వాలు మాత్రమే కాదు... జవసత్వం ఉన్న నాయకత్వం. ఈ కొత్త రాజకీయ వ్యాకరణాన్ని ముందుగా చదివిన పార్టీకి లాభం... పాత సమీకరణాలకే పరిమితమైన పార్టీకి నష్టం. రాబోయే రెండున్నరేళ్ల తెలంగాణ రాజకీయాల్లో నాయకుల బలాన్ని కాదు... నవతరం తీర్పును పరీక్షించబోతున్నాయి.



# జెన్-జీ చూపే దిశే రేపటి రాజకీయం జంతర్ మంతర్ ఇచ్చిన సందేశం

## ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

ఒకప్పుడు రాజకీయాల్లో వారసత్వం గెలిపించేది. ఇప్పుడు విశ్వసనీయత గెలిపిస్తోంది. ఒకప్పుడు కుల సమీకరణాలు అధికారాన్ని నిర్ణయించేవి. ఇప్పుడు మొబైల్ స్క్రీన్‌పై కనిపించే ఒక్క వీడియో ప్రజాభిప్రాయాన్ని మార్చేస్తోంది. ఒకప్పుడు పార్టీ కార్యాలయంలో తీసుకున్న నిర్ణయం చివరి మాట. ఇప్పుడు జెన్-జీ చేతిలోని స్మార్ట్‌ఫోన్ కొత్త రాజకీయ తీర్పు చెబుతోంది. ఢిల్లీలో జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత దేశ రాజకీయాలకు ఒక స్పష్టమైన సందేశం వెళ్లింది. యువతను నిర్లక్ష్యం చేసిన పార్టీ ఎంత బలంగా ఉన్నా ప్రమాదంలో పడుతుంది. యువత ఆశయాలను అర్థం చేసుకున్న పార్టీ ఎంత చిన్నదైనా భారీ రాజకీయ లాభం పొందే అవకాశం ఉంది. ఇదే సమీకరణ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. సభ్యత్వాల పోటీ బయట కనిపిస్తున్నా... లోపల సాగుతున్న అసలు యుద్ధం జెన్-జీ మనసు కోసం. అభివృద్ధి, ఉద్యోగాలు, విద్య, డిజిటల్ అవకాశాలు, పారదర్శక పాలన కోరుతున్న కొత్త తరం ముందు పాత రాజకీయ సూత్రాలు సరిపోతాయా? లేక కొత్త నాయకత్వం, కొత్త భాష, కొత్త ఆలోచనలే విజయాన్ని నిర్ణయిస్తాయా? ఇదే ఇప్పుడు కీలక ప్రశ్న.

- 7లో...

# షాకు లేఖ.. కాక..!

పార్లమెంట్‌లో పేలనున్న గన్స్
విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌కు అనుమతిచ్చారా?
అమిత్ షాను నిలదీసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్!



విద్యార్థులపై పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్ వినియోగంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జూలై 20న ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపించారు. విద్యార్థులపై ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి మీరు అనుమతి ఇచ్చారా? ఇవ్వకపోతే ఎవరు ఆదేశాలు జారీ చేశారు? అని అమిత్ షాను సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హోంమంత్రి అమిత్ షాకు ఘాటు లేఖ రాశారు.

- 6లో...




# సలసలా కాలుతున్న బొండా...

## బొండా ఉమాకు బాబు వార్నింగ్?

- 5లో...


హెచ్చరికా..? వ్యూహాత్మక సంకేతమా?
ఉమను చల్లార్చడం బాబుకు సాధ్యమేనా?
టీడీపీలో పొగలుకక్కుతున్న అసమ్మతి సెగలు

## స్థానిక ఎన్నికలకు కౌంట్‌డౌన్!



సెప్టెంబర్ నుంచే ఎన్నికలు?

- 5లో...



# బంగాళాఖాతంలో వాయుగుండం

2 సముద్రాలపై తీవ్ర ప్రభావం... ముంచెత్తనున్న వర్షాలు!
బలపడుతున్న అల్పపీడనం
రెండు వ్యవస్థలను కలుపుతున్న షియర్ జోన్

బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తూర్పు మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

- 6లో...

# రోజావే.. చిన్ని రోజావే!

## నెక్ట్స్ టార్గెట్ నువ్వేలే!

రోజా నోటీసులు..
రాజకీయ కక్షా? చట్టమా?
కేసులు కాదు.. రాజకీయ కక్ష అంటున్న రోజా
రాజకీయాలకు కొత్త అస్త్రం



- 5లో...



## డీఎస్సీపై పోరుబాట

లోకేశ్ రాజీనామా చేయాల్సిందే!
కన్నబాబు ఘాటు విమర్శలు

- 5లో...




# ఆర్టీసీని బతకనివ్వండి!

ప్రభుత్వ బస్సులు.. ప్రైవేటు చేతుల్లోకేనా?
ఆర్టీసీపై ప్రభుత్వం నిర్ణయం ఏంటి?
ప్రభుత్వ రవాణాను ప్రైవేటు చేతుల్లోకి నెట్టొద్దు
సర్కార్‌ను వేడుకుంటున్న కార్మిక సంఘాలు

- 5లో...




# విద్యకు భరోసా

## ఒక పోస్ట్‌కు స్పందన..

**లోకేశ్ స్ఫూర్తిదాయక నిర్ణయం!**

**యువతి ఆవేదనకు కదిలిన వైనం**

శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం రత్నే నాయక్ తండాలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల మూతపడటంపై గ్రామానికి చెందిన ఓ యువతి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్ట్ రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. పాఠశాల లేక గ్రామంలోని చిన్నారులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వీడియో వైరల్ కావడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు.

**లోకేశ్ సానుకూల నిర్ణయం**

విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామానికి చెందిన యువతి తన పాఠశాలపై చూపిన అనుబంధాన్ని ప్రశంసించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పాఠశాలను తిరిగి ప్రారంభించే అవకాశాలను వెంటనే పరిశీలించాలని తన కార్యాలయాన్ని ఆదేశించారు. ఈ నిర్ణయం విద్యార్థులకు కొత్త ఆశను కలిగించింది.

**స్పందించే నాయకత్వానికి నిదర్శనం**

ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాదు, వెంటనే చర్యలు తీసుకోవడమే మంచి నాయకత్వానికి గుర్తు. రత్నే నాయక్ తండా పాఠశాల అంశంలో నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయం అదే విషయాన్ని మరోసారి నిరూపించింది. ఒక యువతి చేసిన విజ్ఞప్తిని గౌరవించి విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందడుగు వేయడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఈ స్పందన మరో ఉదాహరణగా నిలుస్తోంది.

# సలసలా కాలుతున్న బొండా...




## ఉమను చల్లార్చడం బాబుకు సాధ్యమేనా?

### టీడీపీలో పొగలుకక్కుతున్న అసమ్మతి సెగలు...

### బొండా ఉమాకు బాబు వార్నింగ్ ఎందుకు?

### హెచ్చరికా..? వ్యూహాత్మక సంకేతమా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార పార్టీలకు అసలు పరీక్ష ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడంలో కాదు... సొంత పార్టీలో అసంతృప్తిని నియంత్రించడంలో ఉంటుంది. ప్రతిపక్షం చేసే విమర్శలకు సమాధానం చెప్పడం సులభమే. కానీ పార్టీ కోసం పోరాడిన నాయకుడి మనసులో పేరుకున్న అసంతృప్తిని చల్లార్చడం అంత తేలిక కాదు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యవహారం ఇదే ప్రశ్నను ముందుకు తెచ్చింది. "సలసలా కాలుతున్న బొండాను... చంద్రబాబు చల్లార్చగలరా?" అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. మాజీ మంత్రి అంబటి రాంబాబుతో బొండా ఉమా ఒకే వేదికపై ఆప్యాయంగా మెలగడం సాధారణ రాజకీయ మర్యాదగా కొందరు భావించినా... అధికార పార్టీ అధిష్ఠానం మాత్రం దానిని అంత తేలికగా తీసుకోలేదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఇది ఇద్దరు నాయకులు పలకరించుకున్న ఘటన మాత్రమే కాదు... టీడీపీలో అంతర్గత అసంతృప్తి బయటపడిన క్షణంగా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు వెంటనే స్పందించి పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడం కూడా ఈ పరిణామానికి ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. వైసీపీ నేతలతో వేదికలు పంచుకోవద్దని, ఆ పార్టీ వేసే రాజకీయ ఉచ్చుల్లో పడొద్దని ఆయన చెప్పడం వెనుక బొండా ఉమా వ్యవహారం ప్రధాన కారణమనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

**బొండా ఉమాకు బాబు వార్నింగ్ ఎందుకు?**

ఇక్కడ అసలు ప్రశ్న ఒకటే. చంద్రబాబు ఇచ్చిన హెచ్చరిక బొండా ఉమా కోసం చేశారా? లేక మిగతా నాయకులకు సందేశంగా చేశారా? రెండూ నిజమే కావచ్చు. కానీ సమస్య హెచ్చరికతో ముగిసిపోదు. అసంతృప్తికి కారణాలేంటో తెలుసుకుని వాటిని పరిష్కరించగలిగితేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. బొండా ఉమా టీడీపీలో కొత్త నాయకుడు కాదు. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా వీధి స్థాయిలో పోరాడిన నాయకుడిగా గుర్తింపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయనపై నమోదైన కేసులు, ఎదుర్కొన్న ఇబ్బందులు, కార్యకర్తలకు ఇచ్చిన అండ... ఇవన్నీ ఆయన రాజకీయ ప్రయాణంలో భాగమే. అలాంటి నాయకుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తాను ఆశించిన గుర్తింపు, ప్రాధాన్యం దక్కలేదనే భావనలో ఉంటే... అది వ్యక్తిగత అసంతృప్తి మాత్రమే కాదు, రాజకీయ సంకేతంగా మారుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదవుల పంపకం, ప్రాధాన్యత, ప్రాంతీయ సమీకరణలు, సామాజిక వర్గాల సమతుల్యత వంటి అంశాల కారణంగా అందరికీ ఒకే స్థాయిలో అవకాశాలు దక్కలేదు. సహజంగానే కొంత మందిలో అసంతృప్తి పెరిగింది. బొండా ఉమా కూడా అదే కోవలో ఉన్నారని చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిపైనే బొండా అసంతృప్తి వ్యక్తం చేయడం కూడా ఇదే ధోరణికి సంకేతంగా చెప్పవచ్చు.

**బొండా అసంతృప్తి.. అధిష్ఠానానికి గట్టి సందేశం**

ఆ తర్వాత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో జరిగిన పరిణామాలు ఈ అసంతృప్తికి మరింత రాజకీయ రంగు పులిమాయి. బొండా ఉమా అక్కడ అంబటి రాంబాబుతో కలివిడిగా కనిపించడమే కాదు... 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమికి ముద్రగడ ఉద్యమాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే కారణమని వ్యాఖ్యానించడం మరో చర్చకు దారి తీసింది. అంటే ఆయన కేవలం వ్యక్తిగతంగా కాకుండా... పార్టీ గత వ్యూహాలపైనా తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. రాజకీయాల్లో సంకేతాలు చాలా ముఖ్యం. ముఖ్యంగా అధికార పార్టీలో ఉన్న నాయకుడు ప్రత్యర్థి పార్టీ సీనియర్ నేతతో ఆప్యాయంగా కనిపిస్తే... అది కార్యకర్తల్లో సందేహాలకు తావిస్తుంది. పార్టీ మారుతున్నారా? లేక అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకొస్తున్నారా? అనే చర్చ మొదలవుతుంది. చాలాసార్లు అలాంటి సంకేతాలే అసలు లక్ష్యం కూడా అవుతాయి. బొండా ఉమా నిజంగానే పార్టీ మారాలని అనుకుంటున్నారా? ప్రస్తుతం అలాంటి స్పష్టమైన ఆధారాలు లేవు. కానీ తన అసంతృప్తిని అధిష్ఠానం గుర్తించేలా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని మాత్రం రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ప్రత్యర్థి నేతతో కనిపించడం ద్వారా తన అసంతృప్తిని మరింత స్పష్టంగా తెలియజేయాలనుకున్నారనే విశ్లేషణ వినిపిస్తోంది. చంద్రబాబు రాజకీయ అనుభవం దాదాపు ఐదు దశాబ్దాలు. ఆయన ఎన్నో అసమ్మతి స్వరాలను విన్నారు. చాలామందిని ఒప్పించారు. మరికొందరిని కోల్పోయారు కూడా. కాబట్టి బొండా ఉమా వ్యవహారాన్ని కూడా ఆయన కేవలం క్రమశిక్షణ సమస్యగా చూడకపోవచ్చు. అయితే హెచ్చరికలతో మాత్రమే ఈ సమస్య పరిష్కారం కాదు.

**అసంతృప్తి మంటలు.. బాబు ఎలా ఆర్పుతారు?**

ఎందుకంటే అసంతృప్తి అనే అగ్ని బయట కనిపించే సమయానికి... లోపల చాలా కాలంగా మండుతూనే ఉంటుంది. దానిపై నీళ్లు చల్లాలంటే ముందుగా మంట ఎందుకు మొదలైందో తెలుసుకోవాలి. ప్రాధాన్యత దక్కలేదనే భావనా? నిర్ణయాల్లో భాగస్వామ్యం లేకపోవడమా? ప్రాంతీయ సమీకరణాల ప్రభావమా? లేక భవిష్యత్ రాజకీయ స్థానం గురించిన ఆందోళనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిందే. టీడీపీకి మరో సవాలు కూడా ఉంది. 2029 ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఆశావహుల సంఖ్య పెరుగుతుంది. అలాంటి సమయంలో బొండా ఉమా వంటి బలమైన నాయకుల అసంతృప్తిని నిర్లక్ష్యం చేస్తే... అది ఇతర నేతలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇంకోవైపు బొండా ఉమాకు కూడా రాజకీయ పరిమితులు ఉన్నాయి. ఆయన పార్టీని వీడే పరిస్థితి ఉందా? అనే ప్రశ్నకు ప్రస్తుతం స్పష్టమైన సమాధానం లేదు. ఎందుకంటే ఆయన రాజకీయ బలం టీడీపీతోనే ఎక్కువగా ముడిపడి ఉంది. కార్యకర్తల బలం, స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా అదే చెబుతున్నాయి. అందువల్ల ఆయన చర్యలను అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకొచ్చే రాజకీయ వ్యూహంగా కూడా చూడవచ్చు. వైసీపీ కూడా ఇలాంటి పరిణామాలను ఆసక్తిగా గమనించే అవకాశం ఉంది. అధికార పార్టీలో చిన్న అసంతృప్తి కనిపించినా... దాన్ని రాజకీయ అవకాశంగా మార్చుకోవడం ప్రతిపక్షం సహజ వ్యూహం. అందుకే చంద్రబాబు పార్టీ నేతలకు ముందుగానే హెచ్చరికలు జారీ చేసి... ఎలాంటి తప్పుడు సంకేతాలు బయటకు వెళ్లకుండా చూసే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

### బొండా అసమ్మతి.. బాబు స్పెషల్ ట్రీట్మెంట్

అయితే రాజకీయాల్లో నిషేధాలు మాత్రమే పనిచేయవు. సంబంధాలు, సంభాషణలు, గౌరవం, భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం. "వాళ్లతో కలవొద్దు" అని చెప్పడం కంటే... "ఎందుకు కలవాల్సి వచ్చింది?" అని అడగడం నాయకత్వానికి మరింత ఉపయోగపడుతుంది. అక్కడే అసలు పరిష్కారం దొరుకుతుంది. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. అసమ్మతి కొత్తది కాదు. కానీ ప్రతి అసమ్మతి ఒకేలా ఉండదు. కొన్నింటి వెనుక వ్యక్తిగత ఆశలు ఉంటాయి. మరికొన్నింటి వెనుక రాజకీయ సందేశం ఉంటుంది. బొండా ఉమా వ్యవహారం రెండో కోవకు దగ్గరగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామం మరో విషయాన్ని కూడా గుర్తు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులను కేవలం ఎన్నికల్లో గెలిపించిన వారిగా కాకుండా... నిర్ణయాల్లో భాగస్వాములుగా భావించాల్సిన అవసరం ఉంది. లేదంటే అసంతృప్తి నెమ్మదిగా అసమ్మతిగా... అసమ్మతి చివరకు రాజకీయ సంక్షోభంగా మారే ప్రమాదం ఉంటుంది. అంతిమంగా చూస్తే... బొండా ఉమా అంబటి రాంబాబుతో ఒకే వేదిక పంచుకోవడం కంటే పెద్ద విషయం... దాని వెనుక ఉన్న రాజకీయ సందేశం. అది అధిష్ఠానం వినాలనుకుంటుందా? లేక క్రమశిక్షణ పేరిట పక్కన పెడుతుందా? అన్నదే రాబోయే రోజుల్లో తేలనుంది. చివరగా చెప్పుకోవాల్సిన అసలు మాట ఏంటంటే.. సలసలా కాలుతున్న బొండాపై చంద్రబాబు హెచ్చరికల నీళ్లు చల్లుతారా? లేక ఆయన మనసులో మండుతున్న అసంతృప్తి కారణాలను గుర్తించి రాజకీయంగా చల్లారుస్తారా? దానికి సమాధానం బొండా ఉమా భవిష్యత్ రాజకీయ అడుగుల్లోనే కాదు... టీడీపీ అంతర్గత ఐక్యతలో కూడా కనిపించనుంది.

# ఆర్టీసీని బతకనివ్వండి!

**ప్రభుత్వ రవాణాను ప్రైవేటు చేతుల్లోకి నెట్టొద్దు...**

**సర్కార్‌ను వేడుకుంటున్న కార్మిక సంఘాలు**

ప్రభుత్వాలు మారుతుంటాయి... విధానాలు మారుతుంటాయి... కానీ ప్రజలకు సేవ చేసే వ్యవస్థలు మాత్రం శాశ్వతంగా ఉండాలి. అలాంటి వ్యవస్థల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఒకటి. కోట్లాది మంది పేదలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు ఆధారపడే ఈ ప్రజా రవాణా సంస్థ ఇప్పుడు మరోసారి కీలక మలుపు వద్ద నిలిచింది. విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయం ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన రేపుతోంది. "ఆర్టీసీని బతకనివ్వండి" అనే ఒక్క నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైంది. ఆర్టీసీ జేఏసీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి వేలాది మంది ఉద్యోగులు మాత్రమే కాదు... సాధారణ ప్రజల నుంచి కూడా మద్దతు లభించడం ఈ అంశం ఎంత సున్నితమైనదో చెబుతోంది. ఉద్యోగుల సమస్యగా ప్రారంభమైన ఈ పోరాటం... ఇప్పుడు ప్రజా రవాణా భవిష్యత్తు కోసం జరుగుతున్న ఉద్యమంగా రూపాంతరం చెందుతోంది. ప్రభుత్వం విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారానే నడపాలని, ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది.

**ప్రభుత్వ బస్సులు.. ప్రైవేటు చేతుల్లోకేనా?**

ప్రైవేటీకరణ అంటే కేవలం యాజమాన్యం మారడమే కాదు... సేవా తత్వం కూడా మారిపోతుంది. ప్రభుత్వ సంస్థకు లాభం కంటే ప్రజా సేవ ముఖ్యమైతే... ప్రైవేట్ సంస్థకు లాభమే ప్రధాన లక్ష్యం. ఫలితంగా లాభాలు రాని గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు తగ్గిపోవచ్చు. విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, దూర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. నష్టాల పేరుతో సేవలను కుదించే అవకాశం లేకపోలేదు. ఉద్యోగులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోరాడుతున్నారని చెప్పడం సరైంది కాదు. ఎందుకంటే వారు లేవనెత్తుతున్న ప్రధాన అంశం విద్యుత్ బస్సుల నిర్వహణ. కొత్త సాంకేతికతను స్వాగతిస్తున్నామే కానీ... దానిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ఎందుకనే ప్రశ్నను వారు ముందుకు తెస్తున్నారు.

**ఆర్టీసీపై ప్రభుత్వం నిర్ణయం ఏంటి?**

ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి తమ సమస్యలను వివరించిన జేఏసీ... ఇప్పుడు జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేయడానికి సిద్ధమైంది. ఈ ప్రక్రియ కూడా ఫలితం ఇవ్వకపోతే జూలై 30న రాష్ట్ర కమిటీ సమావేశంలో తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటించనుంది. అంటే ఈ పోరాటం మరింత ఉధృతం కావచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని ఉద్యోగుల ఆందోళనగా మాత్రమే కాకుండా ప్రజా ప్రయోజనాల కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. విద్యుత్ బస్సులు కాలుష్య రహిత రవాణాకు ప్రతీక. అలాంటి ఆధునిక సేవలను మరింత బలోపేతం చేయాలంటే ఆర్టీసీని బలహీనపరచడం కాదు... మరింత బలపరచాలి. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ప్రభుత్వ సంస్థను ఆర్థికంగా, పరిపాలనా పరంగా బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్టీసీ అనేది కేవలం ఒక సంస్థ కాదు... అది కోట్లాది మంది జీవితాలను గమ్యానికి చేర్చే ప్రజా నమ్మకం. దశాబ్దాలుగా ఎండలోనూ, వానలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ సేవలందించిన వ్యవస్థ. అలాంటి సంస్థను క్రమంగా ప్రైవేటీకరణ వైపు నెట్టడం కంటే, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పునరుద్ధరించడం ప్రభుత్వ బాధ్యత. ఈ వివాదంలో చివరికి గెలవాల్సింది ప్రభుత్వం కాదు... ఉద్యోగులు కాదు... ప్రజా ప్రయోజనం. అందుకే ఒక ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తోంది...

# రోజావే.. చిన్ని రోజావే..!

## నెక్స్ట్ టార్గెట్ నువ్వేలే...!!



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికారం మారిన ప్రతిసారీ ఒక ప్రశ్న మళ్లీ మళ్లీ వినిపిస్తుండటం సహజం. అవినీతిపై చర్యలా? రాజకీయ కక్ష సాధింపా? అధికార పక్షం చట్టపరమైన చర్యలుగా సమర్థించుకునే ప్రతి నిర్ణయాన్ని ప్రతిపక్షం రాజకీయ వేధింపులుగా అభివర్ణించడం కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు మాజీ మంత్రి, వైసీపీ మహిళా నేత ఆర్కే రోజాకు పోలీసులు నోటీసులు జారీ చేయడం మరోసారి ఇదే చర్చకు తెరలేపింది. తిరుపతి ఈస్ట్ పోలీసులు జారీ చేసిన నోటీసుల ప్రకారం ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని రోజాను ఆదేశించారు. ఈ నోటీసులు అందుకున్న వెంటనే ఆమె స్పందించిన తీరు చూస్తే... ఇది కేవలం ఒక కేసుకు సంబంధించిన న్యాయ ప్రక్రియగా కాకుండా రాజకీయ పోరాటంగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. తనపై నమోదైన కేసులు అక్రమమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా హరిస్తున్నారని మండిపడ్డారు. ఇక అధికార పక్షం దృక్కోణం వేరుగా ఉంది. చట్టం ముందు అందరూ సమానమేనని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చట్టపరమైన ప్రక్రియ తప్పదని కూటమి ప్రభుత్వం చెబుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనలు, నమోదైన ఫిర్యాదులు, వివిధ కేసులపై విచారణ కొనసాగుతోందని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. అందువల్ల ఈ నోటీసులను కేవలం రాజకీయ కోణంలో మాత్రమే చూడలేమని వారి వాదన.

**రోజా నోటీసులు.. రాజకీయ కక్షా? చట్టమా?**

అయితే రాజకీయ వాస్తవాలు మాత్రం మరో చిత్రాన్ని చూపిస్తున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత పలువురు వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదవడం, కొందరు అరెస్టు కావడం, మరికొందరు తరచూ విచారణలకు హాజరవుతుండటం వల్ల ప్రతిపక్షంలో ఆందోళన పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో రోజాకు నోటీసులు రావడం సహజంగానే రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. రోజా అంటే సాధారణ నాయకురాలు కాదు. తన పదునైన వ్యాఖ్యలతో, దూకుడైన రాజకీయ శైలితో, ప్రత్యర్థులపై తీవ్ర విమర్శలతో ఆమె ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ముఖ్యంగా టీడీపీ అధికారంలో లేని రోజుల్లో చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, టీడీపీ నాయకత్వంపై అత్యంత ఘాటుగా విమర్శలు చేసిన నేతల్లో రోజా ముందుంటారు. అదే సమయంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆమె వ్యాఖ్యలు తరచూ వివాదాలకు కేంద్ర బిందువయ్యాయి. రాజకీయాల్లో ప్రతి మాటకు కూడా ఒక చరిత్ర ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన వ్యాఖ్యలు, ప్రదర్శించిన వైఖరి... అధికారం కోల్పోయిన తర్వాత రాజకీయ ప్రత్యర్థుల వైఖరిపై ప్రభావం చూపుతుంటాయి. రోజా విషయంలో కూడా అలాంటి రాజకీయ వాస్తవాన్ని చాలామంది ప్రస్తావిస్తున్నారు. ఒకప్పుడు తీవ్ర స్థాయిలో విమర్శించిన నాయకురాలిపై ఇప్పుడు చట్టపరమైన చర్యలు వేగవంతం కావడం యాదృచ్ఛికమా? లేక రాజకీయ ప్రతిస్పందనా? అనే చర్చ జరుగుతోంది.

**కేసులు కాదు.. రాజకీయ కక్ష అంటున్న రోజా**

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని విస్మరించకూడదు. ప్రజాస్వామ్యంలో ఎవరూ చట్టానికి అతీతులు కారు. మాజీ మంత్రి అయినా, అధికార పార్టీ నాయకుడైనా, ప్రతిపక్ష నేత అయినా చట్టపరమైన విచారణకు సహకరించడం బాధ్యతే. అదే సమయంలో చట్ట అమలు సంస్థలు రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేస్తున్నాయనే నమ్మకాన్ని కూడా ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, అధికార దుర్వినియోగంపై చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. అయితే ప్రతిపక్షం మాత్రం ఈ చర్యలు ఎంపిక చేసిన నాయకులపైనే కేంద్రీకృతమయ్యాయని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి కేసు, ప్రతి నోటీసు రాజకీయ చర్చగా మారుతోంది. చట్టపరమైన ప్రక్రియ కంటే రాజకీయ వ్యాఖ్యానాలే ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. రోజా స్పందన కూడా అదే దిశగా సాగింది. బెదిరింపులకు భయపడనని, అక్రమ కేసులతో తన గొంతును నొక్కలేరని ఆమె స్పష్టం చేశారు. అంటే ఈ వ్యవహారాన్ని న్యాయపరమైన అంశంగా మాత్రమే కాకుండా రాజకీయ పోరాటంగా కొనసాగించేందుకు ఆమె సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

**చట్టమా.. కక్షా? తేల్చేది దర్యాప్తు మాత్రమే**

ఏపీ రాజకీయాలు ఇప్పటికే తీవ్రమైన వైరం, పరస్పర ఆరోపణలు, కేసులు, అరెస్టులతో వేడెక్కాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరో ప్రముఖ నాయకురాలిపై చర్యలు ప్రారంభమవడం రాజకీయ ఉష్ణోగ్రతను మరింత పెంచే అవకాశముంది. ముఖ్యంగా మహిళా నాయకురాలిగా రోజాకు ఉన్న గుర్తింపు, ప్రజల్లో ఉన్న పరిచయం కారణంగా ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశమవుతోంది. అయితే చివరికి తేలాల్సింది ఒక్కటే. రోజాకు జారీ చేసిన నోటీసులు చట్టపరమైన విచారణలో భాగమా? లేక ప్రతిపక్షం చెబుతున్నట్టుగా రాజకీయ కక్ష సాధింపా? దీనికి సమాధానం ఆరోపణల్లో కాదు... దర్యాప్తు పారదర్శకతలో, న్యాయ ప్రక్రియలో, కోర్టుల పరిశీలనలో దొరుకుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఎంత ముఖ్యమో, చట్టం తన పని తాను చేసుకునే స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్య బలాన్ని నిర్ణయిస్తుంది. రోజా వ్యవహారం కూడా అదే సమతుల్యతకు మరో పరీక్షగా మారింది. రాజకీయ రంగస్థలంపై ఇప్పుడు వినిపిస్తున్న ప్రశ్న మాత్రం ఒక్కటే... ఇది రోజాకు వచ్చిన ఒక నోటీసు మాత్రమేనా? లేక వైసీపీ కీలక నేతలపై కొనసాగుతున్న రాజకీయ-న్యాయ పోరాటంలో మరో కీలక అధ్యాయమా? రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలే దానికి స్పష్టమైన సమాధానం ఇవ్వనున్నాయి.

**రాజకీయాలకు కొత్త అస్త్రం**

ఇది వైసీపీకి కూడా ఒక రాజకీయ అవకాశంగా మారే అవకాశం ఉంది. తమ నేతలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ప్రజల్లో ప్రచారం చేయడానికి ఈ ఘటనను ఉపయోగించుకునే అవకాశముంది. మరోవైపు టీడీపీ శ్రేణులు మాత్రం భిన్నంగా స్పందిస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యర్థులపై రోజా చేసిన విమర్శలు, వ్యాఖ్యలు ఇప్పుడు ఆమెకే రాజకీయంగా ప్రతికూలంగా మారుతున్నాయని వారు చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎంత దూకుడుగా వ్యవహరించారో, ఇప్పుడు చట్టపరమైన ప్రక్రియను కూడా అదే ధైర్యంతో ఎదుర్కోవాలని అంటున్నారు. రాజకీయాల్లో ఒక శాశ్వత సత్యం ఉంటుంది. అదేంటంటే అధికారం శాశ్వతం కాదు. కానీ అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు, మాట్లాడిన మాటలు మాత్రం చాలా కాలం వెంటాడుతుంటాయి. అందుకే ప్రతి నాయకుడు అధికారంలో ఉన్నప్పుడు కూడా సంయమనం పాటించాల్సిన అవసరం ఉంటుంది.

# డీఎస్సీపై పోరుబాట

**లోకేశ్ రాజీనామా చేయాల్సిందే!**

**సీబీఐ విచారణకు పార్టీ డిమాండ్**

**కన్నబాబు ఘాటు విమర్శలు**



డీఎస్సీ నియామకాలలో భారీ అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే అన్ని ఆధారాలు బయటపెట్టామని చెప్పారు. అయినా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇప్పటి వరకు స్పందించలేదని విమర్శించారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించడమే నిజాలు వెలుగులోకి వచ్చే మార్గమని డిమాండ్ చేశారు. గతంలో లోకేశ్ చాలెంజ్ విసిరితే తాము సిద్ధంగా ముందుకొచ్చామని కన్నబాబు గుర్తు చేశారు. అయితే ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పకుండా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన తర్వాత కేంద్రంలో బీజేపీ మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని కన్నబాబు ప్రస్తావించారు. అదే తరహాలో డీఎస్సీ వ్యవహారంలో కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్రమాలపై స్పష్టమైన ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం సీబీఐ విచారణకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

## స్థానిక ఎన్నికలకు కౌంట్‌డౌన్!

**సెప్టెంబర్ నుంచే ఎన్నికలు?**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం, వచ్చే 40 రోజుల్లో విడతల వారీగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ముందుగా సెప్టెంబర్ రెండో వారం నుంచి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. చివరి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలను అక్టోబర్ రెండో వారంలో నిర్వహించే దిశగా సన్నాహాలు సాగుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్, ఏర్పాట్లపై సంబంధిత శాఖలతో ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో అధికారిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# బంగాళాఖాతంలో వాయుగుండం

## రెండు సముద్రాలపై తీవ్ర ప్రభావం
## దేశంలో ముంచెత్తనున్న వర్షాలు!

భారత్‌లో మరోసారి భారీ వర్షాలకు వాతావరణం సిద్ధమవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి, పశ్చిమ రాజస్థాన్‌పై ఉన్న అల్పపీడన ప్రభావం ఒకేసారి చురుకుగా మారాయి. ఈ రెండు వాతావరణ వ్యవస్థలు పరస్పరం ప్రభావితం కావడంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే పరిస్థితి ఏర్పడింది.

**బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం**

బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం వేగంగా బలపడుతోంది. ఇది సోమవారం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ ప్రభావంతో ఏపీ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తూర్పు మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే ఒడిశాలోని జగత్సింగ్‌పూర్ జిల్లాలో ఒక్కరోజులోనే 33 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అరేబియా సముద్రంలో పెద్ద తుఫాను లేకపోయినా అక్కడి నుంచి భారీగా తేమ దేశంలోకి ప్రవేశిస్తోంది. ఈ తేమే దేశవ్యాప్తంగా వర్షాలను మరింత ఉధృతం చేసే ప్రధాన కారణంగా మారింది.

**రెండు వ్యవస్థలను కలుపుతున్న షియర్ జోన్**

బంగాళాఖాతం అల్పపీడనం, రాజస్థాన్ అల్పపీడనాన్ని తూర్పు-పడమర దిశలో ఉన్న షియర్ జోన్ అనుసంధానిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితి గాలిని పైకి లేపి భారీ మేఘాలను ఏర్పరుస్తోంది. ఫలితంగా మధ్య భారతదేశం మీదుగా విస్తారంగా వర్షాలు కురిసే పరిస్థితి ఏర్పడింది. ఒక వ్యవస్థ తూర్పున బలపడుతుండగా మరో వ్యవస్థ పశ్చిమం నుంచి తేమను అందించడం వల్ల వర్షాల తీవ్రత మరింత పెరుగుతోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఢిల్లీ, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర బంగాళాఖాతంలో గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో మత్స్యకారులు జూలై 29 వరకు సముద్రంలోకి వెళ్లొద్దని సూచించింది. రెండు సముద్రాల ప్రభావంతో ఏర్పడిన ఈ అరుదైన వాతావరణ పరిస్థితి దేశవ్యాప్తంగా భారీ వర్షాలకు దారితీయనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

# షాకు లేఖ.. కాక...!

## పార్లమెంట్‌లో పేలనున్న గన్స్
## విద్యార్థులపై పెల్లెట్ గన్స్‌కు అనుమతిచ్చారా?
## అమిత్ షాను నిలదీసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్!



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఘాటు లేఖ రాశారు. జూలై 20న ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపించారు. ముఖ్యంగా పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్ వినియోగంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులపై ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి మీరు అనుమతి ఇచ్చారా? ఇవ్వకపోతే ఎవరు ఆదేశాలు జారీ చేశారు? అని అమిత్ షాను నేరుగా ప్రశ్నించారు.

**విద్యార్థులపై బలప్రయోగం ఆరోపణలు**

న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేపట్టారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వారి సమస్యలు వినాల్సిన ప్రభుత్వం బలప్రయోగంతో స్పందించిందని విమర్శించారు. లాఠీచార్జి, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ కారణంగా వందలాది మంది విద్యార్థులు గాయపడ్డారని ఆరోపించారు. మహిళా విద్యార్థులపై కూడా అనుచితంగా వ్యవహరించారంటూ లేఖలో ప్రస్తావించారు. పెల్లెట్ గన్స్ కారణంగా 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు.

**పార్లమెంట్‌లో ప్రభుత్వానికి చుట్టుముట్టే వ్యూహం**

ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రధానంగా లేవనెత్తాలని ప్రతిపక్షం నిర్ణయించినట్లు సమాచారం. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసే అవకాశముంది. విద్యార్థుల భవిష్యత్తుపై కాల్పులు జరపడం సహించబోమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. సోమవారం జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నారు.

**సీఆర్పీఎఫ్ స్పందన**

ఆందోళన సమయంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇచ్చారా అనే ప్రశ్నపై సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ స్పందించారు. ప్రతి పెద్ద ఆపరేషన్ తర్వాత చేసే విధంగానే ఈ ఘటనపైనా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళన ముగిసిన తర్వాత జరిగిన పరిణామాలను వృత్తిపరంగా విశ్లేషించి తుది అభిప్రాయాన్ని వెల్లడిస్తామని చెప్పారు.

**ఇతర అంశాలపైనా ప్రతిపక్ష దూకుడు**

విద్యార్థులపై పోలీసు చర్యతో పాటు రామాలయ విరాళాల అక్రమాల ఆరోపణలు, ఇంధనంలో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల కలిగే ప్రభావం వంటి అంశాలపై కూడా కేంద్రన్ని ప్రతిపక్షం ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతోంది. రామాలయ విరాళాల వ్యవహారంపై కాంగ్రెస్ విలేకరుల సమావేశాలు నిర్వహిస్తోంది. త్వరలో ప్రవేశపెట్టనున్న యాంటీ పేపర్ లీక్ బిల్లుపైనా ప్రతిపక్షం దూకుడుగా వ్యవహరించే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో వర్షాకాల సమావేశాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కోలుకుంటున్న షర్మిల



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్వల్ప ఉదర శస్త్రచికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ఎక్స్ వేదికగా వెల్లడించారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారని, ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడుతోందని తెలిపారు. తన ఆరోగ్యం గురించి ఆరా తీసిన ప్రతి ఒక్కరికీ షర్మిల కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట సమయంలో అందించిన ప్రార్థనలు, అభిమానమే తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆమె త్వరగా కోలుకోవాలని సందేశాలు పంపారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు కూడా షర్మిల ఆరోగ్యం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారం.




# కాల్పుల కలకలం..!

## కర్నూలులో గాల్లోకి కాల్పులు.. పరారైన దుండగులు

కర్నూలు నగరంలో ఆదివారం కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. నగరంలోని వీఆర్ఎన్ బ్యాడ్మింటన్ అకాడమీ సమీపంలో కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా గాల్లోకి కాల్పులు జరిపారు. కాల్పుల శబ్దాలు వినిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఒక్కసారిగా బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి కారులోనే వేగంగా పరారైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాల్పులు ఎందుకు జరిగాయి? దుండగుల లక్ష్యం ఏమిటి? అనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకుని నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాల్పుల వెనుక వ్యక్తిగత విభేదాలున్నాయా? లేక మరేదైనా కారణమా? అనే అంశాలపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో కర్నూలు నగరంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అప్రమత్తమై దుండగులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

# రామచంద్రపురం అమ్మాయి అరుదైన ఘనత

## గిన్నిస్ ఘనతతో మెరిసిన నిహారిక
## ఒలింపిక్స్ లక్ష్యంగా అడుగులు
## అభినందించిన మంత్రి సుభాష్



రామచంద్రపురం పట్టణానికి చెందిన విద్యార్థిని కారుమూరి నిహారిక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుని రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నిహారికను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఆమెకు గిన్నిస్ ప్రశంసాపత్రం, మెడల్ అందజేసి అభినందించారు.

**కరాటే ప్రదర్శనలో ప్రపంచ రికార్డు**

హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన భారీ కరాటే ప్రదర్శనలో 22 దేశాలు, 10 రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొన్నారు. గంటపాటు సాగిన ప్రదర్శన అనంతరం ఎంపికైన కొద్దిమంది విజేతల్లో నిహారిక ఒకరిగా నిలిచి గిన్నిస్ రికార్డు సాధించింది. నిహారిక కిక్‌బాక్సింగ్, కరాటే, బాక్సింగ్ విభాగాల్లో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించింది. కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఛాంపియన్‌గా గుర్తింపు పొందిన ఆమె, బాక్సింగ్‌లో జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణిస్తోంది. క్లాసికల్ డాన్సర్‌గా కూడా తన ప్రతిభను చాటుతోంది.

**ఒలింపిక్ పతకమే లక్ష్యం**

తన విజయాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందించిన ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని నిహారిక తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి భారతదేశానికి గౌరవం తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పింది. రానున్న ఒలింపిక్స్‌లో పతకం గెలవడమే తన జీవిత ఆశయమని స్పష్టం చేసింది. నిహారికలాంటి ప్రతిభావంతులు రాష్ట్ర యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు.



# రాజకీయాల్లోనే కొనసాగుతా!

## ఎన్నికలకు మాత్రం గుడ్‌బై..
## మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య వీడ్కోలు

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య ఎన్నికల రాజకీయాలకు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. 2028 ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేశారు. అయితే ప్రజా జీవితానికి దూరం కాబోనని, కాంగ్రెస్ పార్టీ కోసం, ప్రజల కోసం చివరి వరకు పనిచేస్తానని వెల్లడించారు. మండ్య జిల్లాలో మాజీ స్పీకర్ కృష్ణ జయంతి కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు.

**మద్దతుదారుల విజ్ఞప్తికి స్పష్టమైన సమాధానం**

మరో పదేళ్లు రాజకీయాల్లో కొనసాగాలని అభిమానులు కోరినా, తన నిర్ణయం మారదని సిద్దరామయ్య తేల్చిచెప్పారు. ప్రస్తుతం వరుణ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, 2028లో మళ్లీ ఎన్నికల బరిలోకి దిగే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఈ ప్రకటనతో సభలో ఉన్న అనేక మంది కార్యకర్తలు భావోద్వేగానికి గురయ్యారు.

**రాజకీయాలు కలుషితమయ్యాయన్న ఆవేదన**

తన నిర్ణయానికి ప్రధాన కారణం ప్రస్తుత రాజకీయాల తీరు అని సిద్దరామయ్య వెల్లడించారు. ఒకప్పుడు ప్రజలే స్వచ్ఛందంగా ఎన్నికల ఖర్చులకు సహాయం చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఎన్నికల్లో నిలవాలంటే ప్రజలకే డబ్బు ఇవ్వాల్సిన స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నిజాయితీ రాజకీయాలకు అవకాశాలు తగ్గిపోయాయని వ్యాఖ్యానించారు.

**50 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి కొత్త మలుపు**

1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా రాజకీయాల్లో అడుగుపెట్టిన సిద్దరామయ్య, 2028 నాటికి 50 ఏళ్ల రాజకీయ ప్రయాణాన్ని పూర్తి చేయనున్నారు. ఈ ఐదు దశాబ్దాల కాలంలో విజయాలు చూశానని, ఓటములను ఎదుర్కొన్నానని చెప్పారు. అయినా ఎప్పుడూ తన సిద్ధాంతాలను విడిచిపెట్టలేదని, మనస్సాక్షిని మోసం చేయలేదని స్పష్టం చేశారు. అదే తన జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశమని పేర్కొన్నారు. తదుపరి అసెంబ్లీ కాలం ప్రారంభమయ్యే సమయానికి తన వయసు 80 సంవత్సరాలు దాటుతుందని సిద్దరామయ్య గుర్తు చేశారు. ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని గతంలో మాదిరిగా శక్తివంతంగా పనిచేయడం సాధ్యం కాదని అంగీకరించారు. ఎన్నికల బరిలో కనిపించకపోయినా ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగుతానని సిద్దరామయ్య స్పష్టం చేశారు.




# లీక్‌లకు శాశ్వత చెక్!

## పరీక్షల ప్రక్షాళనకు ఆరుగురు మేధావులు..
## నిపుణుల చేతిలో పరీక్షల భవిష్యత్
## పరీక్షల వ్యవస్థకు కేంద్రం కొత్త బ్లూప్రింట్

దేశంలో పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు శాశ్వత అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం హైపవర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. నీట్ పేపర్ లీక్ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ కీలక నిర్ణయం ప్రకటించారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకణి నేతృత్వంలో ఈ కమిటీ పనిచేయనుంది. పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత, పారదర్శకత, అత్యాధునిక సాంకేతికత వినియోగమే ప్రధాన లక్ష్యమని కేంద్రం స్పష్టం చేసింది.

**నీలేకని నుంచి సోమనాథ్ వరక**

టాస్క్‌ఫోర్స్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులకు చోటు కల్పించారు. ఆధార్ వ్యవస్థ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన నందన్ నీలేకని డిజిటల్ భద్రత, డేటా రక్షణపై సూచనలు అందించనున్నారు. మాజీ ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ పరీక్షల నిర్వహణలో జీరో-ఎర్రర్ విధానాలు, బహుస్థాయి భద్రతా వ్యవస్థల రూపకల్పనకు తన అనుభవాన్ని వినియోగించనున్నారు. అంతరిక్ష మిషన్ల తరహాలో ఖచ్చితమైన పరీక్షల నిర్వహణపై ఆయన దృష్టి సారించనున్నారు.

**మాఫియాపై నిఘా.. సైబర్ రక్షణ**

మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా పరీక్షల మాఫియాను గుర్తించే నిఘా వ్యవస్థలపై సూచనలు ఇవ్వనున్నారు. ప్రశ్నాపత్రాల లీక్ ముఠాలను ముందుగానే గుర్తించే రియల్‌టైమ్ పర్యవేక్షణ వ్యవస్థల రూపకల్పనకు ఆయన అనుభవం ఉపయోగపడనుంది. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి పరీక్షల సాఫ్ట్‌వేర్, సర్వర్ వ్యవస్థలను సైబర్ దాడుల నుంచి రక్షించే ఆధునిక భద్రతా వ్యవస్థలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించనున్నారు.

**విద్యా సంస్కరణలకు అనుభవజ్ఞుల తోడ్పాటు**

మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్ పరీక్షల విధానం, విద్యార్థుల ప్రయోజనాలు, జవాబు కీ వివాదాలు, గ్రేస్ మార్కుల విధానం, పరీక్షా కేంద్రాల ప్రమాణాలపై సమగ్ర సూచనలు అందించనున్నారు. మాజీ ఐఏఎస్ అధికారి అమృత్ లాల్ మీనా ప్రశ్నాపత్రాల ముద్రణ, నిల్వ, రవాణా వ్యవస్థలను మరింత సురక్షితంగా మార్చే లాజిస్టిక్స్ నమూనాలను రూపొందించనున్నారు.

**పరీక్షలపై విశ్వాసమే లక్ష్యం**

ఈ హైపవర్ టాస్క్‌ఫోర్స్ నివేదిక ఆధారంగా జాతీయ పరీక్షల సంస్థ నిర్వహణలో నిర్మాణాత్మక మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సాంకేతికత, నిఘా, విద్యా పరిపాలన, లాజిస్టిక్స్, సైబర్ భద్రత వంటి అన్ని రంగాల నిపుణులు ఒకే వేదికపై పనిచేయడం ఈ కమిటీ ప్రత్యేకతగా నిలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీలకు శాశ్వత అడ్డుకట్ట వేయడం, దేశ పరీక్షల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడమే ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యంగా మారింది.



# కెప్టెన్ ముద్ర..!

## జింబాబ్వేలో శ్రేయస్ సత్తా
## యువజట్టుతో 3-0 క్లీన్‌స్వీప్

**జిం**బాబ్వేపై 3-0తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం తన కెరీర్‌లో ప్రత్యేకమైన క్షణమని భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆనందం వ్యక్తం చేశాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లలో ఎదురైన నిరాశకు ముగింపు పలుకు తూ యువ జట్టుతో తొలి సిరీస్ విజయాన్ని అందుకో వడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు. భారత జట్టులోని యువ ఆటగాళ్ల నిర్భయ ఆటతీరు, అపారమైన ఉత్సాహమే ఈ విజయానికి అసలు కారణమని ప్రశంసించాడు. ఐపీఎల్ ద్వారా యువ క్రికెటర్లు ఇప్పటికే ఎంతో అనుభవం సంపాదించారని, వారిలోని ప్రతిభను వెలికి తీయడమే కెప్టెన్‌గా తన బాధ్యత అని వివరించాడు. ప్రతి ఆటగాడు ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా ఆడే వాతావరణాన్ని కల్పిస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని పేర్కొన్నాడు. ఈ సిరీస్‌తో జట్టు మంచి ఊపు అందుకుందని, ఇకపై కూడా అదే ధైర్యం, అదే నిలకడ కొనసాగిస్తే భారత క్రికెట్‌కు మరిన్ని విజయాలు ఖాయమని శ్రేయస్ విశ్వాసం వ్యక్తం చేశాడు.



# చేసిన తప్పులే పాఠాలయ్యాయి

## బిష్ణోయ్ రాత మార్చిన వైఫల్యాలు

**ఒ**కే మ్యాచ్‌లో చేసిన తప్పులు ఓ ఆటగాడి కెరీర్‌ను వెనక్కి నెట్టొచ్చు. కానీ అదే తప్పులను పాఠాలుగా మార్చుకుంటే విజయాలు తిరిగి దారితీస్తాయి. భారత లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఇప్పుడు అదే నిరూపించాడు. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో వరుసగా మూడు నోబాల్స్ వేయడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న బిష్ణోయ్, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోచ్‌లు సాయిరాజ్ బహుతులే, సునీల్ జోషి పర్యవేక్షణలో తన రన్‌అప్‌లోని లోపాలను సరిదిద్దుకున్నాడు. స్టంప్స్‌కు నేరుగా వచ్చేలా రన్‌అప్‌ను మార్చడంతో అతని బౌలింగ్‌కు మళ్లీ పదును వచ్చింది. జింబాబ్వే సిరీస్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. హరారే పిచ్‌పై పెద్దగా టర్న్ లేకపోయినా, బంతి నేరుగా వెళ్లి తక్కువ ఎత్తులో బౌన్స్ కావడం తనకు బాగా కలిసొచ్చిందని బిష్ణోయ్ తెలిపాడు. తప్పులను సరిదిద్దుకుంటే విజయం దూరంలో ఉండదనే సందేశాన్ని ఈ యువ స్పిన్నర్ తన ఆటతో మరోసారి నిరూపించాడు.

# హరారేలో భారత్ హవా..

## వైభవ్ సూర్యవంశీ తుఫాన్‌తో జింబాబ్వేపై క్లీన్‌స్వీప్!

జింబాబ్వే గడ్డపై టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని ఘనంగా చాటింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ బ్యాట్ మెరుపులతో మైదానాన్ని ప్రకాశింపజేయగా, భారత్ మూడో టీ20లో 35 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ 49 బంతుల్లో 81 పరుగులు బాదుతూ భవిష్యత్ భారత క్రికెట్‌కు తానే కొత్త ఆశాకిరణమని నిరూపించాడు. ఎనిమిది ఫోర్లు, నాలుగు భారీ సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. భారత్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే 157/7కే పరిమితమైంది. ర్యాన్ బర్ల్ అజేయ అర్ధశతకంతో పోరాడినా ఫలితం మారలేదు. బ్యాటింగ్‌లో వైభవ్ మెరుపులు, బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన, సమష్టి ఆటతో టీమిండియా మరో విజయగాథ రాసింది. యువ ఆటగాళ్ల సత్తాతో భారత క్రికెట్‌కు వెలుగైన భవిష్యత్ కనిపిస్తోందనే నమ్మకాన్ని ఈ సిరీస్ మరింత బలపరిచింది.



# వైభవ్ కల నిజమైంది

**అవార్డులతో రివార్డులు**

**జిం**బాబ్వే పర్యటన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ జీవితంలో మరపురాని అధ్యాయంగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకోవడం తన కల నిజమైన క్షణమని ఆనందం వ్యక్తం చేశాడు. మూడు టీ20ల్లో 151 పరుగులు సాధించిన వైభవ్, తొలి మ్యాచ్‌లో 19 బంతుల్లోనే అర్ధశతకం బాదగా, చివరి మ్యాచ్‌లో 49 బంతుల్లో 81 పరుగులతో భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. కోచ్, కెప్టెన్ తనపై పూర్తి నమ్మకం ఉంచారని, సహజమైన టీ20 ఆటనే కొనసాగించమని ప్రోత్సహించారని తెలిపాడు. అదే తన విజయానికి ప్రధాన కారణమని చెప్పాడు. హరారే మైదానంలో గతంలో అండర్-19 ప్రపంచకప్ ఆడిన అనుభవం కూడా ఉపయోగపడిందని వెల్లడించాడు. ప్రాక్టీస్‌లో చేసే ప్రతి అంశాన్ని మ్యాచ్‌లో అమలు చేయడానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాడిగా అద్భుత ఆత్మవిశ్వాసం, నిలకడైన ప్రదర్శనతో వైభవ్ భారత క్రికెట్‌కు మరో భవిష్యత్ స్టార్‌గా అవతరించాడనే అభిప్రాయం అభిమానుల్లో బలపడుతోంది.



# తరం మారుతోంది...! జనసత్వాలున్నోడిదే అధికారం

## ఏపీలో ముందస్తు ఎన్నికల వాతావరణం

ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేడి పెరిగింది. అధికార కూటమి, ప్రతిపక్షం రెండూ ఇప్పటికే ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయాయి. సభ్యత్వ నమోదు, కేడర్ బలోపేతం, సోషల్ మీడియా విస్తరణ, యువ నాయకత్వానికి అవకాశాలు... అన్ని పార్టీలు ఒకేసారి వేగం పెంచాయి. అసలు ఎన్నికల యుద్ధం ప్రారంభం కాకముందే మానసిక యుద్ధం మొదలైందనే భావన కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలాన్ని మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీగా నిర్వహించింది. పార్టీ ప్రకటించిన గణాంకాల ప్రకారం సభ్యుల సంఖ్య కోటి మార్కును దాటింది. 1,00,52,598 మంది సభ్యులు నమోదు కావడం పార్టీకి మానసిక బలంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, అండమాన్ ప్రాంతాల్లో కూడా సభ్యత్వాలు నమోదు కావడం ద్వారా పార్టీ విస్తరణను చాటే ప్రయత్నం చేసింది. టీడీపీ సభ్యత్వాలను కేవలం గణాంకాలుగా చూడలేదు. సభ్యులకు ప్రమాద బీమా, డిజిటల్ సభ్యత్వ కార్డులు, నియోజకవర్గాల వారీగా పోటీ వాతావరణం సృష్టించడం ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. నెల్లూరు సిటీ, ఆత్మకూరు, పాలకొల్లు వంటి నియోజకవర్గాలు సభ్యత్వాల్లో అగ్రస్థానంలో నిలవడం అంతర్గత పోటీకి సంకేతంగా మారింది.

## సభ్యత్వాలు... విజయానికి హామీనా?

2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా సంస్థాగత పునర్నిర్మాణంపై దృష్టి పెట్టింది. సభ్యత్వ నమోదు కొనసాగుతున్నా మొత్తం సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినా గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, కేడర్‌ను చురుకుగా ఉంచడం, డిజిటల్ ప్రచారాన్ని కొనసాగించడం వంటి చర్యలు చేపడుతోంది. ఓటమి తర్వాత కూడా కేడర్‌ను కాపాడుకోవడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. జనసేన కూడా సభ్యత్వాలను ఉద్యమ విస్తరణకు పునాదిగా ఉపయోగిస్తోంది. ఎన్నికల తర్వాత సభ్యత్వాలను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. "ఉద్యమి", "సాధక్", "ప్రదాత" వంటి విభాగాలుగా కార్యకర్తలను వర్గీకరించడం కొత్త ప్రయోగంగా నిలిచింది. అభిమానులను కార్యకర్తలుగా, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దాలనే ఆలోచన ఇందులో కనిపిస్తోంది. యువతను నేరుగా పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. సభ్యత్వాలు ఎక్కువగా ఉంటే ఎన్నికల్లో విజయం ఖాయమా? భారత రాజకీయ చరిత్ర చెప్పే సమాధానం మాత్రం "కాదు". సభ్యత్వాలు పార్టీ సంస్థాగత బలాన్ని తెలియజేస్తాయి. కానీ ఓటరు పోలింగ్ బూత్‌లో తీసుకునే నిర్ణయాన్ని ప్రభావితం చేసేవి వేరే అంశాలు. నాయకత్వం, స్థానిక సమస్యలు, అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రభుత్వ పనితీరు, ప్రజల్లో ఉన్న విశ్వాసం... ఇవే తుది ఫలితాన్ని నిర్ణయిస్తాయి.



**జెన్-జీ చూపే దిశే రేపటి రాజకీయం**
**ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు**
**జంతర్ మంతర్ ఇచ్చిన సందేశం**

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన జంతర్ మంతర్ ఉద్యమం భారత రాజకీయాల్లో కొత్త చర్చకు నాంది పలికింది. అది కేవలం ఒక నిరసన కాదు. రాజకీయాల దిశ మారుతోందనే హెచ్చరిక. ఒకప్పుడు కులాలు, ప్రాంతాలు, సంక్షేమ హామీలు, సంప్రదాయ ఓటు బ్యాంకులే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేవి. ఇప్పుడు వాటి మధ్య కొత్త శక్తిగా జెన్-జీ ముందుకొస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, వేలి చివర ఏఐ, ప్రపంచాన్ని కలిపే సోషల్ మీడియా... ఇవే ఈ తరానికి ఆయుధాలు. చరిత్రను రాసే శక్తి కూడా వీరిదే. రాజకీయ కథనాన్ని మార్చే శక్తి కూడా వీరిదే. ఇదే విషయాన్ని ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు అర్థం చేసుకుంటున్నాయి. ఒకప్పుడు లక్షల మందితో సభ నిర్వహించడం నాయకత్వానికి నిదర్శనం. ఇప్పుడు ఒక వీడియో, ఒక రీల్, ఒక హ్యాష్‌ట్యాగ్ లక్షల మందిని ఒకే భావోద్వేగంలోకి తీసుకువస్తోంది. రాజకీయ చర్చలు ఇక సభల వేదికలకే పరిమితం కావడం లేదు. ప్రతి మొబైల్ స్క్రీన్ ఇప్పుడు రాజకీయ వేదికగా మారింది. డిజిటల్ ఉద్యమాలు ప్రభుత్వాలను స్పందించేలా చేస్తున్నాయి. యువత తమ అభిప్రాయాన్ని నిమిషాల్లో దేశవ్యాప్తంగా వ్యాప్తి చేస్తోంది. ఇదే కొత్త రాజకీయ సంస్కృతి.

### అసలు యుద్ధం ఇప్పుడే మొదలు

2024 ఎన్నికలు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేశాయి. కూటముల ప్రభావం, సంక్షేమ పథకాలు, స్థానిక సమీకరణాలు, ప్రచార వ్యూహాలు కలిసి ఫలితాలను నిర్ణయించాయి. అందుకే 2029 ఎన్నికలను కేవలం సభ్యత్వాల అంకెలతో అంచనా వేయడం సాధ్యం కాదు. పార్టీ కార్యాలయంలో నమోదైన సంఖ్యల కంటే పోలింగ్ బూత్‌లో పడే ఓటే కీలకం. జెన్-జీ ప్రత్యేకత ఒక్కటే. ఈ తరం రాజకీయాలను వారసత్వంగా స్వీకరించదు. ప్రశ్నిస్తుంది. పోల్చి చూస్తుంది. ఫ్యాక్ట్ చెక్ చేస్తుంది. ఐదేళ్ల క్రితం ఒక పార్టీకి ఓటు వేసిన యువకుడు, ఐదేళ్ల తర్వాత పూర్తిగా భిన్నమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, సాంకేతిక అవకాశాలు, స్టార్టప్‌లు, పారదర్శక పాలన, డిజిటల్ సేవలు... ఇవే ఈ తరం రాజకీయ నిర్ణయాలకు ప్రధాన ప్రమాణాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం బయటకు కనిపిస్తున్నది సభ్యత్వాల పోటీ. లోపల సాగుతున్నది యువత మనసుల కోసం యుద్ధం. పార్టీ కార్యాలయం ఒక రాజకీయ కేంద్రం అయితే మొబైల్ ఫోన్ మరో కేంద్రంగా మారిపోయింది. అందుకే ప్రతి పార్టీ సోషల్ మీడియా బృందాలను విస్తరిస్తోంది. కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రచారం, షార్ట్ వీడియోలు, లైవ్ ప్రసారాలు, యువ ఇన్‌ఫ్లూయెన్సర్లతో ప్రచారం... ఇవన్నీ ఎన్నికల వ్యూహంలో భాగమవుతున్నాయి.

### నాయకత్వం మారుతోందా... రాజకీయ శైలి మారుతోందా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గత నాలుగు దశాబ్దాలుగా పరిశీలిస్తే ప్రతి ఎన్నిక వెనుక ఒక బలమైన నాయకత్వ కథనం కనిపిస్తుంది. ఒక దశలో ఎన్టీఆర్ ప్రభంజనం రాజకీయాలను మలిచింది. తర్వాత చంద్రబాబు నాయుడు అభివృద్ధి రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ రాజకీయాలను కేంద్రంగా నిలిపారు. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భారీ ప్రజాదరణతో తనదైన మాస్ ఇమేజ్‌ను నిర్మించుకున్నారు. ప్రస్తుతం కూటమి రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రభావాన్ని చూపుతున్నారు. అయితే ఇప్పుడు నాయకుల కరిష్మాతో పాటు మరో శక్తి కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుతోంది. అదే జెన్-జీ.

### మూడు పార్టీల లక్ష్యం ఒక్కటే

టీడీపీ వద్ద పరిపాలనా అనుభవం, బలమైన సంస్థాగత వ్యవస్థ ఉంది. వైసీపీ వద్ద మాస్ నాయకత్వం, గ్రామ స్థాయి కేడర్ ఉంది. జనసేన వద్ద యువ అభిమాన శక్తి ఉంది. మూడు పార్టీల బలం వేర్వేరుగా ఉన్నా లక్ష్యం మాత్రం ఒక్కటే. జెన్-జీ విశ్వాసాన్ని గెలుచుకోవడం. ఒకప్పుడు గ్రామ సభలు, ర్యాలీలు, పోస్టర్లు ఎన్నికల ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించేవి. ఇప్పుడు షార్ట్ వీడియోలు, సోషల్ మీడియా లైవ్‌లు, రీల్స్, పోడ్‌కాస్ట్‌లు, డిజిటల్ ప్రచారమే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. గ్రాఫిక్స్ డిజైనర్లు, డేటా విశ్లేషకులు, సోషల్ మీడియా బృందాలు ఇప్పుడు ప్రతి రాజకీయ పార్టీలో కీలక భాగంగా మారాయి. రాజకీయ యుద్ధభూమి ప్రతి మొబైల్ స్క్రీన్‌లోకి చేరుకుంది. సోషల్ మీడియాలో వైరల్ కావడం ఎన్నికల్లో విజయానికి హామీ కాదు. అదే విధంగా సభ్యత్వాల సంఖ్య కూడా గెలుపును నిర్ణయించదు. చివరికి పోలింగ్ బూత్ వద్ద ఓటరు తీసుకునే నిర్ణయమే అసలు తీర్పు. అయినప్పటికీ ఆ నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రక్రియలో డిజిటల్ ప్రపంచం పాత్ర గతంతో పోలిస్తే ఎన్నో రెట్లు పెరిగింది. 2029 ఎన్నికల నాటికి తొలిసారి ఓటు వేయబోయే యువత సంఖ్య గణనీయంగా పెరగనుంది. ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, జీవన ప్రమాణాలు, పారదర్శక పాలన వంటి అంశాల ఆధారంగా ఈ తరం నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. భావోద్వేగ ప్రసంగాలు మాత్రమే కాకుండా పనితీరు కూడా పరీక్షకు రానుంది. ప్రచారం, పనితీరు, విశ్వసనీయత మధ్య సమతుల్యత సాధించిన పార్టీకే యువత మద్దతు లభించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### వారసత్వం మాత్రమే కాదు... గెలిపించేది విశ్వాసమే

రాజకీయాల్లో వారసత్వం ఒక తలుపు మాత్రమే తెరవగలదు. ఆ తలుపు దాటి ప్రజల మనసుల్లో స్థానం సంపాదించేది పనితీరు. సోషల్ మీడియా చప్పుళ్లు తాత్కాలికం కావచ్చు. సభ్యత్వాల అంకెలు ఉత్సాహాన్ని ఇవ్వొచ్చు. కానీ అధికారాన్ని నిర్ణయించేది ప్రజల విశ్వాసం. ముఖ్యంగా జెన్-జీ విశ్వాసం. ప్రశ్నించే ఈ తరం మాటలు కాదు... ఫలితాలు చూస్తుంది. హామీలు కాదు... అమలు కోరుతుంది. అందుకే 2029 ఎన్నికల అసలు పోటీ అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య మాత్రమే కాదు. పాత రాజకీయ శైలి, కొత్త డిజిటల్ రాజకీయ సంస్కృతి మధ్య కూడా. ఈ మార్పును వేగంగా అర్థం చేసుకున్న రాజకీయ శక్తికే రేపటి అధికారం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## స్టోరీలో అసలు ట్విస్ట్ ....

**1. జెన్-జీనే కొత్త రాజకీయ శక్తి**
ఢిల్లీ జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత యువత ప్రభావం రాజకీయాల్లో మరింత స్పష్టమైంది. కులాలు, వారసత్వాలు, సంప్రదాయ ఓటు బ్యాంకుల కంటే జెన్-జీ ఆలోచనలే 2029 ఎన్నికల సమీకరణాలను మార్చే శక్తిగా ఎదుగుతున్నాయి.

**2. సభ్యత్వాల పోటీ... ఓట్లకు గ్యారంటీ కాదు**
టీడీపీ, జనసేన, వైసీపీ సభ్యత్వాలపై దూకుడు పెంచుతున్నాయి. అయితే సభ్యత్వాల సంఖ్య పార్టీ బలాన్ని చూపొచ్చు గానీ, ఎన్నికల్లో గెలిపించేది మాత్రం ప్రజల విశ్వాసం, పనితీరు, యువత తీర్పే.

**3. డిజిటల్ యుగంలో మారిన ప్రచారం**
రాజకీయ యుద్ధభూమి ఇప్పుడు సభల నుంచి మొబైల్ స్క్రీన్‌లకు మారింది. సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు, షార్ట్ వీడియోలు, డిజిటల్ ప్రచారం యువ ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేసే ప్రధాన ఆయుధాలుగా మారాయి.

**4. మూడు పార్టీలు... ఒకే లక్ష్యం**
టీడీపీ అభివృద్ధిని, వైసీపీ మాస్ నాయకత్వాన్ని, జనసేన యువశక్తిని ముందుకు తెస్తున్నాయి. కానీ మూడు పార్టీల అసలు లక్ష్యం ఒక్కటే జెన్-జీ విశ్వాసాన్ని గెలిచి 2029 ఎన్నికల్లో ఆధిపత్యం సాధించడం.

**5. వారసత్వం కాదు... జనసత్వమే నిర్ణయం**
2029 ఎన్నికల్లో అధికారాన్ని నిర్ణయించేది పేరు, కుటుంబం, సంప్రదాయం కాదు. ఉద్యోగాలు, విద్య, అభివృద్ధి, పారదర్శక పాలన కోరుతున్న జెన్-జీ మనసు గెలిచిన రాజకీయ శక్తికే భవిష్యత్తు అధికారం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## చంద్రబాబు అభివృద్ధి కథనం

ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీకి ప్రధాన వ్యూహకర్తగా కొనసాగుతున్నారు. అభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమలు, డిజిటల్ పరిపాలన, మౌలిక సదుపాయాలపై ఆయన నిరంతరం దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, సమాచార సాంకేతిక రంగాన్ని విస్తరించడం, ఆధునిక నగరాల నిర్మాణం వంటి అంశాలను రాజకీయ చర్చల్లో ముందుకు తీసుకొస్తున్నారు. జెన్-జీ ఎక్కువగా ఆసక్తి చూపే ఉద్యోగాలు, టెక్నాలజీ, స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి అంశాలను టీడీపీ రాజకీయ కథనంలో ప్రధానంగా నిలపాలని ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## లోకేశ్‌పై పెరుగుతున్న బాధ్యత

టీడీపీలో మరో కీలక పరిణామం నాయకత్వ తరాల మార్పు. నారా లోకేశ్‌ను భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగుతోందనే అభిప్రాయం చాలాకాలంగా వినిపిస్తోంది. "యువగళం" పాదయాత్ర ద్వారా వేలాది మంది యువతతో నేరుగా మాట్లాడిన లోకేశ్, ఉద్యోగాలు, విద్య, స్థానిక సమస్యలపై వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా యువ నాయకులకు అవకాశాలు కల్పించడం, పార్టీ కార్యక్రమాలను ఆధునిక ప్రచార పద్ధతులతో నిర్వహించడం, సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించడం వంటి చర్యలు ఆయన రాజకీయ శైలిలో కనిపిస్తున్నాయి.




## జగన్‌కు మాస్ ఇమేజ్?

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రయాణం భావోద్వేగం, ప్రజాదరణ, సంక్షేమ హామీల చుట్టూ సాగింది. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చినా, తనకంటూ ప్రత్యేక రాజకీయ శైలిని నిర్మించుకున్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైనప్పటికీ జగన్ వ్యక్తిగత ప్రజాదరణ ఎలా ఉందో ఆయన బయటకు వస్తున్నప్పుడు కనిపిస్తోన్న రెస్పాన్స్ స్పష్టం చేస్తోంది. వైసీపీ ఇప్పటికీ ప్రధాన ప్రతిపక్షంగా బలంగా ఉంది. గ్రామ స్థాయి కేడర్, మద్దతుదారుల విశ్వాసం పార్టీకి చెక్కుచెదరకుండా ఉన్నాయి. సోషల్ మీడియా ప్రచారానికి ప్రాధాన్యం ఇచ్చిన పార్టీల్లో వైసీపీ కూడా ఒకటి. గత ఎన్నికల్లో డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగించింది. ప్రస్తుతం కూడా ప్రత్యేక డిజిటల్ వేదికలు, యాప్‌లు, సోషల్ మీడియా ప్రచారం ద్వారా యువతను చేరుకునే ప్రయత్నం కొనసాగుతోంది.

## పవన్ కళ్యాణ్‌కు యువత అండ

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ బలం సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటుంది. సినిమాల ద్వారా ఏర్పడిన అభిమాన వర్గం రాజకీయాల్లో కూడా ఆయనకు ప్రధాన బలంగా మారింది. ముఖ్యంగా యువత, తొలిసారి ఓటు వేసే వర్గం, అభిమాన సంఘాల్లో ఆయనకు ఉన్న ఆదరణ ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆయన ప్రసంగాల్లో కనిపించే భావోద్వేగం, సామాజిక అంశాలపై స్పందించే తీరు జనసేనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. అయితే అభిమానాన్ని శాశ్వత రాజకీయ బలంగా మార్చుకోవడం అంత సులభం కాదు. ప్రతి ఎన్నికలో అభిమానం ఓట్లుగా మారుతుందనే హామీ లేదు. సంస్థాగత బలం, స్థానిక నాయకత్వం, బూత్ స్థాయి వ్యవస్థ కూడా అంతే కీలకం. ఈ సవాలును జనసేన ఎలా ఎదుర్కొంటుందన్నది రాబోయే ఎన్నికల్లో ఆసక్తికరంగా మారనుంది.

# మూడో స్వర్ణం.. రికార్డ్ బ్రేక్

## మీరాబాయి... మేరా భారత్ మహాన్!






ఇనుప బరువులను ఎత్తింది ఒక్క మీరాబాయి కాదు... కోట్లాది భారతీయుల గర్వాన్ని కూడా భుజాలపై మోసింది. గ్లాస్గో వేదికపై ప్రతి లిఫ్ట్‌తో ప్రత్యర్థులను వెనక్కి నెట్టేస్తూ, ప్రతి క్షణాన్ని భారత విజయగాథగా మార్చేసింది. 190 కిలోల గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని వరుసగా మూడో కామన్‌వెల్త్ గోల్డ్‌ను అందుకుంది. స్నాచ్‌లో రికార్డు... క్లీన్ అండ్ జెర్క్‌లో రికార్డు... చివరకు స్వర్ణంపై తన పేరే ముద్రించింది. ఒత్తిడిని అవకాశంగా మార్చడం అంటే ఏమిటో మరోసారి ప్రపంచానికి చూపించింది. మీరాబాయి చాను బార్‌బెల్‌ను పైకెత్తిన ప్రతిసారీ... భారత త్రివర్ణ పతాకం మరింత ఎత్తుకు ఎగిరింది. ఇదే నిజమైన ఛాంపియన్ మార్క్... ఇదే "మీరాబాయి... మేరా భారత్ మహాన్!"

### చరిత్ర సృష్టించిన మీరాబాయి

గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మరోసారి తన సత్తా చాటింది. మహిళల 48 కిలోల విభాగంలో మొత్తం 190 కిలోల బరువును ఎత్తి కామన్‌వెల్త్ గేమ్స్ రికార్డును బద్దలు కొట్టింది. ఈ విజయంతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. వరుసగా మూడో కామన్‌వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం గెలిచి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆమె ప్రదర్శనతో భారత క్రీడాభిమానులు ఆనందంలో మునిగిపోయారు.

### రెండు విభాగాల్లోనూ రికార్డులే

మీరాబాయి చాను స్నాచ్ విభాగంలో 85 కిలోలు ఎత్తి గేమ్స్ రికార్డును నమోదు చేసింది. ఆ తర్వాత క్లీన్ అండ్ జెర్క్‌లో 105 కిలోలు విజయవంతంగా ఎత్తి మరో రికార్డును నెలకొల్పింది. రెండు విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆమె ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మొత్తం 190 కిలోలతో గేమ్స్ రికార్డును సృష్టిస్తూ స్వర్ణాన్ని సులభంగా దక్కించుకుంది.

**ప్రధాని అభినందనలు**

మీరాబాయి చాను చారిత్రాత్మక విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దేశం గర్వపడే విజయమని కొనియాడారు. స్వర్ణం గెలిచిన తర్వాత స్పందించిన మీరాబాయి, వరుసగా మూడో స్వర్ణం సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పింది. భారత్‌కు పతకం తీసుకురావడం తన జీవితంలో అత్యంత గర్వకారణమని పేర్కొంది. భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్యకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నానని వెల్లడించింది.

### అరుదైన హ్యాట్రిక్ ఘనత


ఈ విజయంతో మీరాబాయి చాను వరుసగా మూడు కామన్‌వెల్త్ గేమ్స్ వ్యక్తిగత స్వర్ణ పతకాలు గెలిచిన మూడో భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఇప్పటికే ఈ ఘనతను రెజ్లర్లు సుశీల్ కుమార్, వినేష్ ఫొగాట్ సాధించారు. ఇప్పుడు ఆ ప్రతిష్ఠాత్మక జాబితాలో మీరాబాయి కూడా చేరింది. భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో ఇది మరో గర్వకారణంగా నిలిచింది.

# రిషికాంతకు చారిత్రక రజతం.. స్నాచ్‌లో కామన్వెల్త్ రికార్డు!



గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత వెయిట్‌లిఫ్టర్ రిషికాంత సింగ్ చనాంబం చరిత్ర సృష్టించాడు. పురుషుల 60 కిలోల విభాగంలో మొత్తం 264 కిలోల బరువును ఎత్తి రజత పతకం గెలిచాడు. స్నాచ్‌లో 121 కిలోలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ కొత్త రికార్డు నెలకొల్పడం విశేషం. క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కిలోలు ఎత్తినా, మలేషియాకు చెందిన మహ్మద్ అనిక్ బిన్ కస్దాన్ 273 కిలోల మొత్తం లిఫ్ట్‌తో స్వర్ణం సాధించాడు. భారత సైన్యంలో సేవలందిస్తున్న మణిపూర్‌కు చెందిన రిషికాంత, 2025 కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి ఈ గేమ్స్‌కు అర్హత సాధించాడు. భారత ఖాతాలో ఇది రెండో పతకంగా నిలిచింది.

# హార్దిక్ కోసం చెన్నై బిగ్ ఆఫర్!



ఐపీఎల్ 2027కు ముందు హార్దిక్ పాండ్య ట్రేడ్ చర్చలు ఆసక్తికరంగా మారాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌ను దక్కించుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ భారీ ఆఫర్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్‌తో పాటు ?10 కోట్లు ఇవ్వడానికి సీఎస్‌కే సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు, యువ బ్యాటర్ ఆయుష్ మాత్రేను ట్రేడ్‌లో ఇవ్వాలని ముంబై కోరుతున్నప్పటికీ, అతడిని వదులుకోవడానికి చెన్నై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ ట్రేడ్ విలువ మొత్తం ?20 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా. అయితే ఇప్పటివరకు ఇరు ఫ్రాంచైజీలు ఈ ఒప్పందంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.



# బాలయ్యను పరామర్శించిన చంద్రబాబు

### నవ్వుతున్న ఫోటోతో అభిమానుల ఆనందం

నందమూరి బాలకృష్ణ ఇటీవల 'ఎన్‌బీకే111' సినిమా షూటింగ్ సందర్భంగా స్వల్ప మోకాలి గాయానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆపరేషన్ విజయవంతంగా పూర్తికాగా ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, బాలకృష్ణ బావమరిది నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాలయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి నుంచి విడుదలైన ఫొటోలో బాలకృష్ణ చిరునవ్వుతో కనిపించడంతో అభిమానులు ఊరట వ్యక్తం చేస్తున్నారు. సహాయకుల సాయంతో నిలబడి నడుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో బాలయ్య ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతోందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల సూచన మేరకు కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం ఆయన మళ్లీ 'ఎన్‌బీకే111' షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. అప్పటి వరకు సినిమాలోని ఇతర నటీనటులతో సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ కొనసాగించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేసింది. అభిమానులు బాలయ్య త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ తెరపై సందడి చేయాలని కోరుకుంటున్నారు.

# రామ్ చరణ్‌కు శస్త్రచికిత్స, తోడుగా చిరంజీవి



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేతి మణికట్టు గాయానికి ఎట్టకేలకు శస్త్రచికిత్స చేయించుకోనున్నారు. 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో గాయపడినప్పటికీ, సినిమా ప్రచార కార్యక్రమాలు పూర్తయ్యే వరకు చికిత్సను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు వైద్యుల సూచన మేరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉన్న ప్రముఖ గంగా ఆస్పత్రిలో సోమవారం శస్త్రచికిత్స జరగనుంది. ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రాజశేఖర్ నేతృత్వంలోని వైద్య బృందం ఈ ఆపరేషన్ నిర్వహించనుంది. రామ్ చరణ్‌కు అండగా మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, ఉపాసనతో పాటు కుటుంబ సభ్యులు కోయంబత్తూర్‌కు బయలుదేరినట్లు సమాచారం. దేశంలోని ప్రముఖ ఎముకల చికిత్స కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన గంగా ఆస్పత్రిలో చికిత్స జరగడంతో అభిమానులు ఊరట వ్యక్తం చేస్తున్నారు.


# హిందీలో 'జన్ నేత' జోరు..




తలపతి విజయ్ ప్రధాన పాత్రలో నటించిన 'జన నాయకన్' హిందీ డబ్బింగ్ వెర్షన్ 'జన్ నేత' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో ముందుకు సాగుతోంది. దేశవ్యాప్తంగా పెద్దగా ప్రచారం లేకపోయినా సినిమా రెండో రోజు కలెక్షన్లు పెరగడం విశేషం. తొలి రోజు రూ. 1.75 కోట్ల నెట్ వసూలు చేసిన ఈ రాజకీయ థ్రిల్లర్, రెండో రోజు రూ. 1.85 కోట్లను రాబట్టింది. దీంతో రెండు రోజుల్లో మొత్తం రూ. 3.6 కోట్ల నెట్, రూ. 4.24 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదు చేసింది. మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజు దాదాపు 5.7 శాతం వృద్ధి కనిపించింది. హిందీ డిస్ట్రిబ్యూషన్ హక్కులు తక్కువ ధరకు విక్రయించడంతో పెట్టుబడిదారులకు రిస్క్ తగ్గిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పెట్టుబడిలో సుమారు 40 శాతం రికవరీ జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

# ఆర్ఎఫ్‌సీలో ఎన్టీఆర్ యాక్షన్ హంగామా

### 'డ్రాగన్' కోసం భారీ ఫైట్ సన్నివేశాలు



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'డ్రాగన్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా నిర్మించిన యూరోపియన్ శైలి భారీ సెట్‌లో కీలక షెడ్యూల్ నిర్వహిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొంటూ హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. యూరప్ నగరాల వాతావరణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ సెట్ సినిమాకు కొత్త విజువల్ ఆకర్షణ తీసుకురానుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో ప్లాన్ చేసిన ఈ ఫైట్ సీక్వెన్స్‌లు సినిమాకే ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సమాచారం. ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇద్దరి స్టైల్ కలిస్తే మరో బ్లాక్‌బస్టర్ ఖాయమనే నమ్మకం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. షూటింగ్‌కు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఈ చిత్రంలో ఎన్టీఆర్‌ను కొత్త అవతారంలో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# రూ.78 కోట్ల విలాస గృహంలో కృతి సనన్

### సీ వ్యూ‌త డూప్లెక్స్ పెంట్‌హౌస్ కొనుగోలు

జాతీయ అవార్డు గ్రహీత, బాలీవుడ్ నటి కృతి సనన్ ముంబైలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటైన బాంద్రా వెస్ట్ పాలి హిల్‌లో రూ. 78 కోట్ల విలువైన విలాసవంతమైన డూప్లెక్స్ పెంట్‌హౌస్‌ను సొంతం చేసుకుంది. సుప్రీమ్ ప్రాణా అనే ప్రీమియం రెసిడెన్షియల్ టవర్‌లో 14, 15 అంతస్తుల్లో విస్తరించిన ఈ ఇల్లు సుమారు 6,636 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించబడింది. అరేబియా సముద్రాన్ని నేరుగా వీక్షించే ఈ నివాసం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దాదాపు 1,209 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ప్రైవేట్ టెర్రస్‌లో సముద్ర అందాలను ఆస్వాదించడంతో పాటు అతిథులకు విందులు ఏర్పాటు చేసే సౌకర్యం ఉంది. ఈ కొనుగోలుతో ఆరు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కూడా లభించాయి. భవనంలో రూఫ్‌టాప్ స్విమ్మింగ్ పూల్, ఫిట్‌నెస్ సెంటర్, యోగా డెక్, క్లబ్‌హౌస్, ల్యాండ్‌స్కేప్ గార్డెన్స్, బ్యాంక్వెట్ హాల్, కాన్సియర్జ్ సేవలు వంటి అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. పరిమిత సంఖ్యలో మాత్రమే నివాసాలు ఉండటంతో గోప్యత, ప్రత్యేకతకు పెద్దపీట వేయబడింది. సినీ కెరీర్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న కృతి సనన్ విలాస జీవనశైలికి ఈ పెంట్‌హౌస్ మరో నిదర్శనంగా నిలిచింది.

# మేనల్లుడికి మహేష్ అండ



### జయకృష్ణ అరంగేట్రానికి సూపర్‌స్టార్ మద్దతు




సూపర్‌స్టార్ మహేష్ బాబు, తన సోదరుడు రమేష్ బాబు తనయుడు ఘట్టమనేని జయకృష్ణ సినీ అరంగేట్రానికి మద్దతు ప్రకటించారు. జూలై 30న విడుదల కానున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు ప్రత్యేక వీడియో విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. జయకృష్ణ తొలి సినిమా కుటుంబానికి ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్న ఆయన, టీజర్, పాటలు, ట్రైలర్ ఆకట్టుకున్నాయని అన్నారు. జయకృష్ణతో పాటు హీరోయిన్ రాశా తడానీ కూడా మంచి ప్రతిభ కనబర్చారని ప్రశంసించారు. దర్శకుడు అజయ్ భూపతి, సాంకేతిక బృందం కృషిని అభినందించిన మహేష్, జి.వి. ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలమని చెప్పారు. ఆల్బమ్‌లోని 'అలెల్లే' పాట తనకు అత్యంత ఇష్టమని వెల్లడించారు. వైజయంతి బ్యానర్‌లోనే తాను కూడా హీరోగా పరిచయమైన విషయాన్ని గుర్తుచేసిన మహేష్, జయకృష్ణకు కూడా అదే అదృష్టం దక్కిందని అన్నారు. తన అభిమానులతో పాటు కృష్ణ అభిమానులంతా ఈ కొత్త హీరోకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

This newspaper is Owned and Published by **KANTIPUDI RAVENDRA** from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: **KANTIPUDI RAVENDRA**, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com. Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085